ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
బుధవారం 17 జూలై 2024


పట్టిసీమ ఎత్తిపోతల నుంచి గోదావరి పరవళ్లు

## మరో రెండు రోజులు భారీ వర్షం

ఏలూరు సిటీ, జూలై 16: బంగాళాఖాతంలో అల్పపీడనం ఉధృతం కావడంతో జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. బలమైన గాలులు వీచే అవకాశం ఉందని, కోస్తా జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. గడిచిన 24 గంటల్లో అత్యధికంగా ముదినేపల్లి మండలంలో 38.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా సరాసరి వర్షపాతం 2.6 మి.మీ. మండలాల వారీగా వర్షపాతం వివరాలివి.. కుక్కునూరు 11 మి.మీ, మండవల్లి 6.2, కలిదిండి 4.8, కైకలూరు 4.6, బుట్టాయిగూడెం 3, వేలేరుపాడు 2, లింగపాలెం 1.2, జంగారెడ్డిగూడెం 1.2, జీలుగుమిల్లి 0.6, పెదపాడు, ఏలూరు అర్బన్ మండలాల్లో 0.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు సార్వా వరితోపాటు ఇతర పంటల సాగు కొనసాగుతోంది. జిల్లాలో సోమవారం అక్కడక్కడా వర్షాలు కురిశాయి. ఉదయం నుంచి మబ్బుల వాతావరణం నెలకొంది.

**బాలికపై అత్యాచారం**
యువకుడితో పాటు ముగ్గురిపై పోక్సో కేసు
7
**రోడ్డెక్కిన ఇసుక లారీలు**
టిప్పర్ లారీల సమ్మె విరమణ

# తడిస్తే.. తడవనీ..!


కంప్యూటర్‌పై కప్పిన కవర్లు

బుట్టాయగూడెం సబ్ స్టేషన్ కార్యాలయం బయట కొత్త విద్యుత్ మీటర్లు గుట్టలుగా పడి ఉన్నాయి. వేసవిలో ఎండకు ఎండుతూనే ఉన్నాయి. ప్రస్తుతం వర్షాలకు తడుస్తున్నాయి. బయట గుట్టలుగా పడి ఉన్న మీటర్లపై కనీసం బరకం కప్పుదామన్న స్పృహ కూడా లేదు. విద్యుత్ బిల్లు కట్టడానికి వచ్చిన వినియోగదారులు తడిచిపోతున్న మీటర్లు, అధికారుల నిర్లక్ష్యాన్ని చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. దీనికితోడు సబ్‌స్టేషన్ కార్యాలయం కూడా శిథిలమైంది. కార్యాలయంలో కంప్యూటర్‌పై కవర్లు కప్పి పనిచేస్తున్నారు.

- కొత్త విద్యుత్ మీటర్లు వర్షార్పణం
- వర్షానికి తడవకుండా కంప్యూటర్‌కు కవర్
- కూలడానికి సిద్ధంగా సబ్‌స్టేషన్ భవనం
- బుట్టాయగూడెం విద్యుత్ శాఖ తీరు

బుట్టాయగూడెం, జూలై 16: ప్రజల సొమ్మేగా ఏమైపోతే మాకేంటిలే.. అనుకున్నారో ఏమో..! లక్షలాది రూపాయలు విలువ చేసే కొత్త విద్యుత్ మీటర్లు నెలల తరబడి వర్షంలో తడిసిపోతున్నా పట్టించుకునే నాథుడే లేడు. ప్రతి నెలా వినియోగదారుల ముక్కుపిండి మరీ బిల్లులు వసూలు చేసే విద్యుత్ శాఖ అధికారులు లక్షల రూపాయల విలువైన సామగ్రి నీటిపాలవుతుంటే పట్టించుకోక పోవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. కరెంటు బిల్లులు కట్టేందుకు కార్యాలయానికి వస్తున్న ప్రజలు తడిసిపోతున్న విద్యుత్ మీటర్లను చూసి సొంత వస్తువులనైతే ఆలానే ఉంచుతారా? అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

### వర్షం నీటిలో నానుతూ..

మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త విద్యుత్ కనెక్షన్లు, పాడైపోయిన మీటర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడానికి వందల సంఖ్యలో కొత్త విద్యుత్ మీటర్లు సబ్ స్టేషన్‌కు వచ్చాయి. వాటిని ఏఈ కార్యాలయంలోని గదిలో


సబ్ స్టేషన్ కార్యాలయం బయట పడివున్న మీటర్లు

పెట్టగా మిగిలిన వాటిని అట్టపెట్టెలతో సహా కార్యాలయం బయట ఉంచేశారు. వేసవిలో ఇబ్బంది లేకపోయినా వర్షాకాలం తడిచి ముద్దవుతున్నాయి. తడిచిపోతున్న మీటర్లపై కనీసం బరకం కూడా కప్పలేదు. కొత్తగా మీటరు బిగించమంటే కొత్తవి రాలేదంటూ చెప్పే అధికారులు, సిబ్బంది తడిచిపోతున్న మీటర్ల విషయంపై ఏం చెబుతారని చూసిన వారు ప్రశ్నిస్తున్నారు. మండలంలో వ్యవసాయ, ఇంటి విద్యుత్ కనెక్షన్లు సుమారు 12 వేల వరకు ఉన్నాయి. నిత్యం బుట్టాయగూడెం, రామారావుపేట సెంటరు, దిప్పకాయలపాడు సబ్‌స్టేషన్ల నుంచి విద్యుత్ సరఫరా జరుగుతుంది. వీటిలో అధిక కనెక్షన్లు బుట్టాయ గూడెం సబ్‌స్టేషన్ పరిధిలోనే ఉన్నాయి.

### శిథిలావస్థకు భవనం..

సబ్ స్టేషన్ కార్యాలయ భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. 40 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరుకుంది. భవనమంతా నీరు కారిపోతుంది. వర్షానికి తడిచిపోకుండా కంప్యూటర్లపై సిబ్బంది కవర్లు, బరకాలు కప్పుతున్నారు. వర్షానికి శ్లాబ్ లీకై భవనం మొత్తం నీరు కారడంతో సిబ్బంది గదిలో ఒక మూలన కూర్చుని విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి. ఇటీవల ఏఈ శ్రీనివాసవర్మ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎల్ఐ పదోన్నతిపై జంగారెడ్డిగూడెం బదిలీ అయ్యారు. దీంతో ఏఈ, ఎల్ఐ బాధ్యతలు ఇన్‌చార్జులే నిర్వర్తిస్తున్నారు. అధికారులు స్పందించి వర్షం పాలవుతున్న విద్యుత్ మీటర్లను మరో చోటకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు. నూతన భవన నిర్మాణానికి గతంలో మంజూరైన రూ.5 లక్షలు నిధులు చాలవంటూ కాంట్రాక్టర్లు భవనాన్ని నిర్మించడానికి ముందుకు రాలేదు. నిధులు పెంచి భవనాన్ని నిర్మించాలని కోరుతున్నారు.

# ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లు ఖతం

## గడచిన ఐదేళ్లలో నేతల నిర్లక్ష్యం.. పట్టించుకోని అధికారులు



ఒకప్పుడు ప్రభుత్వ కార్పొరేషన్ ఏదైనా సందర్శకులతో కిటకిటలాడుతూ కనిపించేవి. సంబంధిత శాఖాధికారులు రోజంతా బిజీబిజీగా ఉండేవారు. సిఫార్సులు, ఒత్తిళ్లతో క్షణం తీరిక లేకుండా కార్యాలయాల్లో రద్దీ. పేద వర్గాలకు రుణ సదుపాయం, స్వయం ఉపాధికి వీలుగా చేయూత లభించేది. దరఖాస్తులను ఆహ్వానించి అర్హత కలిగిన వారికి రుణాలు, సబ్సిడీలు ఇచ్చేవారు. చిన్న యూనిట్ల నుంచి మొదలు ఇన్నోవా కార్ల వరకు క్లియరెన్స్ ఇచ్చేవారు. కలెక్టర్లు స్వయంగా బ్యాంకర్ల సమావేశంలో రుణ పరపతి లక్ష్యాలను నిర్దేశించేవారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుగుణంగా రుణాల మంజూరులో కచ్చితంగా వ్యవహరించేవారు. మంత్రులు, ఎమ్మెల్యేలు పదే పదే నియోజకవర్గాలు, జిల్లాల వారీగా సమీక్షించేవారు. 2014-19 వరకు టీడీపీ పాలనలో కార్పొరేషన్‌లో ఈ తరహా పనితీరు కనిపించేది. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేషన్లు అన్నింటిని ఖతం చేశారు.

- ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి

- రుణాలు లేవు
- చేతినిండా పనిలేదు
- ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన కార్పొరేషన్లు నేడు సర్వనాశనం

గడిచిన ఐదేళ్లల్లో వైసీపీ ప్రభుత్వ నిర్వీర్యం చేసిన వాటిలో కార్పొరేషన్లు ముందు వరుసలో ఉన్నాయి. ఒకప్పుడు ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్‌లే కాకుండా ప్రభుత్వ ఊతంతో మరిన్ని రాణించిన దాఖలాలు ఉన్నాయి. కాని 2019 నుంచి 2024 వరకు ఐదేళ్ల కాలంలో కార్పొరేషన్లు వైసీపీ సర్కార్ చేతిలో విలవిల్లాడిపోయాయి. గతంలో తెలుగుదేశం హయాంలో ఇచ్చిన మాదిరిగా రుణసదుపాయం లేదు. బడ్జెట్‌లో తగినంత నిధుల సంపత్తి లేదు. ఏటా కార్పొరేషన్ల వారీగా చేయాల్సిన పనుల లక్ష్యం అంతకన్నా లేదు. రుణం కోసం, స్వయం ఉపాధి కోసం తరలివచ్చే ప్రజలెవ్వరూ మచ్చుకైనా కనిపించలేదు. అంతలా కార్పొరేషన్లు నీరుగారిపోయాయి. అంతకు ముందు బీసీ కార్పొరేషన్ ప్రామాణికంగా ఆదరణ పేరిట వివిధ కుల వృత్తులు అన్నింటికి రుణ సదుపాయం, వృత్తి పరికరాలు, సబ్సిడీపై అందించేవారు. నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులను ఎంపికచేసి వారికి కొంతలో కొంత జీవనోపాధికి వీలుగా బాటలు వేసేవారు. గ్రామస్థాయిలో కాస్తంత వెనుకబడిన కుటుంబాలను కాస్తోకూస్తో పైకితెచ్చే ప్రయత్నం అప్పట్లో జరిగింది. అధికారులతో పాటు రాజకీయాల్లో ఉన్నవారంతా వాటికి ఊతమిచ్చేవారు.

### బీసీ కార్పొరేషన్‌కు ఆదరణ లేదు

బీసీ వర్గాల్లో ఆదరణ పథకానికి ఒక దశలో విపరీతమైన డిమాండ్ పెరిగింది. అప్పట్లో ప్రభుత్వం లక్ష్యాలను అందుకోవడానికి అధికారులు శ్రమించాల్సి వచ్చేది. బీసీ కార్పొరేషన్, తెలుగుదేశం హయాంలో ఓ వెలుగు వెలగ్గా ఐదేళ్ల జగన్ సర్కార్‌లో సర్వనాశనమైంది. బీసీ వర్గాలకు పైపైకి హామీలు, లోలోన రిక్తహస్తం చూపారు. ఓట్ల కోసమే కథ నడుపుతూనే.. నా బీసీలు అంటూ ప్రసంగాల్లో ఊదరగొట్టేవారు. కాని వాస్తవానికి బీసీ కార్పొరేషన్ ఈ ఐదేళ్లలో ఎన్నడూలేని విధంగా పతనమైంది. కార్పొరేషన్ ఉనికినే కోల్పోయే స్థాయికి వచ్చింది. బీసీ కార్పొరేషన్ పరిధిలో ఉద్యోగులకు జీతభత్యాలు ఇవ్వడం తప్ప, మరే లక్ష్యాన్ని ప్రభుత్వపరంగా నిర్దేశించలేకపోయారు. ఒకప్పుడు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బీసీ కార్పొరేషన్‌కు ఏకంగా నాలుగువేల కోట్లకు పైబడి బడ్జెట్ కేటాయింపులు ఉండేవి. గడిచిన ఐదేళ్లల్లో నయాపైసా బడ్జెట్ పద్దులో కనిపించనే లేదు.

### ఎస్సీ కార్పొరేషన్ పథకాలు శూన్యం

ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో 2014-19 మధ్య ఎస్సీ యువతకు స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం వివిధ పథకాలు అమలు చేసింది. ఎస్సీ వర్గాలకు తగినంత రుణ ఎరపతి కల్పించే దిశగా బ్యాంకర్లను ఒత్తిడిచేసి అయినా లక్ష్యాలను చేరుకునే దిశగా అధికారులను పరుగులు పెట్టించారు. అప్పట్లో కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఎవరుంటే వారే తమ పరిధిలో లక్ష్యాలను పూర్తి చేయడానికి ఉరకలు వేసేవారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉండగా, 2018-19 ఆర్థిక సంవత్సరాల్లో మరింతగా ఎస్సీ కార్పొరేషన్‌కు ఊతమిచ్చింది. చేతివృత్తి చేసుకునే వారికి కొంతలో కొంత రోజువారి ఉపాధి దక్కేలా ఆటోలు, ట్రాక్టర్లు, ఇతరత్రా పరికరాలను అందించడానికి ప్రయత్నించింది. ఈ దశలోనే మారుతున్న కాలంతో పాటు యువత అవసరాలను గుర్తించి ఉపాధికి శాశ్వత స్థానం ఇచ్చేందుకు వీలుగా సబ్సిడీపై ఇన్నోవా కార్లను పంపిణీ చేసేందుకు ముందుకు వచ్చింది. అప్పట్లో ఎన్నికల కాలం కాబట్టి మరింతగా ఈ రంగానికి ప్రాణం పోసేందుకు సిద్ధ పడింది. ఇదే క్రమంలో ఇన్నోవా కార్లు సాధారణ ఎస్సీలకు అందలేదు. కేవలం కొంతమంది పలుకుబడితోనే స్వాధీన పరుచుకోగలిగారు. అప్పట్లో అధికార యంత్రాంగం ఈ వ్యవహారంలో, రుణాలు పంపిణీలో ఇష్టానుసారం వ్యవహరించినా గాడి తప్పకుండా అప్పటి ప్రభుత్వం జాగ్రత్త పడింది.

### మైనారిటీ, కాపులకు మొండిచేయి

మైనార్టీ సంక్షేమంలో కూడా ఇదే ధోరణి. అప్పట్లో మైనార్టీల కోసం ఎడాపెడా పథకాలు పెట్టి వారికోసం రుణాలను బారీగా మంజూరయ్యేలా ప్రయత్నించింది. కాపు కార్పొరేషన్ ద్వారా కాపువర్గాలు అన్నింటికి మేలు చేసే ప్రక్రియ మాత్రం శరవేగంగా సాగింది. బీసీలతో పాటు కాపులకు సమంగా ప్రాధాన్యత ఇచ్చి కొత్త పుంతలు తొక్కేదిశగా అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం అడుగులు కదిపింది. కాపు యువతకు, మహిళలకు ఇచ్చే ప్రత్యేక రుణసదుపాయ కల్పనకు ప్రయత్నించింది. దీనిలో భాగంగానే జిల్లావ్యాప్తంగా దాదాపు రూ.152 కోట్లు ఒక్క ఏడాదిలోనే రుణంగా అందించగలిగారు. సమాంతరంగా ఎస్టీలకు ఇదే తరహాలో కొంతలో కొంత ఆదుకునే ప్రయత్నం జరిగింది. ఐదేళ్లలో ఆయా కార్పొరేషన్లు ఉనికి కోల్పోయాయి.

### వైసీపీ పాలనలో అంతా అథపాతాళంలోకి..

2014-19 మధ్య తెలుగుదేశం హయాంలో కార్పొరేషన్లు అన్నింటికి జీవం పోసేందుకు అప్పటి ప్రభుత్వం ప్రయత్నించగా, 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వం అసలు కార్పొరేషన్లు అన్నింటిని పాతాళంలోకి నెట్టింది. ఎక్కడికక్కడ కార్పొరేషన్ ప్రమేయం లేదన్నట్లు పప్పుబెల్లాలకు సిద్ధపడింది. వ్యవస్థను అంతటిని వలంటీర్ చేతిలో పెట్టింది. బీసీ కార్పొరేషన్‌కు తెలుగుదేశం హయాంలో ఐదేళ్ల పాటు రాష్ట్రవ్యాప్తంగా వేలకోట్లు బడ్జెట్‌లో కేటాయించగా వైసీపీ హయాంలో గడిచిన ఐదేళ్లలో అంతా సున్నా. ప్రభుత్వపరంగా బటన్ నొక్కుడే తప్ప వ్యక్తిగతంగా ఊతమిచ్చేందుకు, బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం అందించేందుకు ఎలాంటి చర్యలు లేవు. కేవలం ఆటోడ్రైవర్ల దగ్గర నుంచి వివిధ ప్రార్థనా మందిరాల్లో పనిచేసే వారికి కూడా బటన్ నొక్కుడు ద్వారా నగదు అందించారు. తిరిగి చెల్లింపులు లేని విధానంలో ఈ వ్యవహారం అంతా సాగింది. దీంతో లబ్ధిదారులకు బాధ్యత లేకుండా పోయింది. కేవలం ప్రభుత్వం సొమ్ములు పంపిణీ చేస్తుంది కాబట్టి నేరుగా ఏ కార్పొరేషన్‌కు వెళ్లాల్సిన అవసరం ఎవరికి లేకుండా పోయింది. దీంతో ఐదేళ్ల పాటు అన్ని కార్పొరేషన్లు దిగజారిపోయాయి. పనిపాట లేకుండా మూలనపడ్డాయి. ఒకప్పుడు కళకళలాడిన కార్పొరేషన్లు ఐదేళ్లలో కనీసం సమీక్షలకు కూడా నోచుకోలేదు. వార్షిక బడ్జెట్‌లో వీటి ప్రస్తావనే లేదు. ఇలా ఒకటేంటి జగన్ హయాంలో వ్యవస్థలు అన్ని ఏ రూపంలో దెబ్బతిన్నాయో కార్పొరేషన్‌లే ప్రత్యక్ష నిదర్శనం. ఇప్పటికి కూడా కార్పొరేషన్‌లో మళ్ళీ పనితీరు మెరుగుపరుస్తారా? లేదా? అన్నది మాత్రం ఇప్పటికి సందిగ్ధమే. ఎందుకంటే ఆర్థికంగా భారీ లోటు చవిచూస్తున్న కూటమి ప్రభుత్వం కార్పొరేషన్లు అన్నింటికి తగినంత పని కల్పించటమే కాకుండా వీటి ద్వారా కనీసం కొంతలో కొంత అయినా నిలదొక్కుకునేలా చేస్తాయా? చేయవా? అనేది సందిగ్ధమే. జగన్ ప్రభుత్వంలో జరిగిన అడ్డగోలు తనానికి కార్పొరేషన్లు అన్ని దాదాపు బలి అయ్యాయి. ఆఖరికి రాజకీయ ఉపాధిగా మరికొన్ని రాద్ధుతేలాయి. కాపు కార్పొరేషన్ ద్వారా కేవలం కొంతమందికి మాత్రమే రుణసదుపాయం కల్పించి చేతులు దులుపుకున్నారు. ఇంతకు మించి జరిగింది ఏమీ లేదు.


చిన్నారితో కలెక్టర్ వెట్రిసెల్వి

## పిల్లలకు భరోసా ఇద్దాం

### పీఎం కేర్ పిల్లలతో కలెక్టర్ ముచ్చట

ఏలూరు క్రైం, జూలై 16 : దేశంలో కరోనా ఎంతో మందిని పొట్టన పెట్టుకుంది. చాలామంది చిన్నారులను అనాథలను చేసింది. వారంతా సమాజంలో ఇబ్బందులకు గురికాకూడదనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన పీఎం కేర్ చిన్న పిల్లల పథకం భరోసా కల్పించింది. ఆ చిన్నారులతో కలెక్టర్ కె.వెట్రిసెల్వి మంగళవారం కాసేపు సరదాగా గడిపారు. చిన్నారులను అప్యాయంగా దగ్గరకు తీసుకుని వారితో మాటమంతి కలిపారు. పీఎంకేర్ బాలల పథకంలో మైనార్టీ తీరిన యువతి వివాహం చేసుకుని చిన్నారికి జన్మనిచ్చింది. ఆ బుజ్జాయిని కలెక్టర్ ఒడిలోకి తీసుకుని కొంతసేపు సరదాగా గడిపారు.

### ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలి

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కొవిడ్ సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన బాలల యోగక్షేమాలను, భవిష్యత్ లక్ష్యాలను తెలుసుకోవడానికి మంగళవారం కలెక్టరేట్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గార్డియన్‌గా ఉన్న కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ బాలలు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, సమాజంలో గౌరవ ప్రదమైన స్థితిలో ఉండాలని సూచించారు. బాల బాలికలకు చదువు, ఎటువంటి ఇబ్బందులున్నా స్వయంగా తనకు తెలియజేయాలన్నారు. 18 ఏళ్ల వయస్సు నిండిన బాలలకు రూ.10 లక్షలు డిపాజిట్ చేసిన పోస్టల్ ఖాతా పుస్తకాలు 19 మందికి అందించారు. బాలల సంరక్షకుల అభినందించి మరింత బాధ్యతగా చూసుకోవాలన్నారు. వారికి ఏ అవసరం ఉన్నా తనకు నేరుగా ఫోన్ చేయాలని కలెక్టర్ నెంబర్ ఇచ్చారు. పోస్టల్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ డి.శ్రీనివాస్, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి కెపీవీఎల్ పద్మావతి, డీసీపీవో సీహెచ్ సూర్యచక్రవేణి, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ రాజీవ్, డీఈవో ఎస్.అబ్రహం, లీడ్ బ్యాంక్ మేనేజర్ డి నీలాద్రి, జి.రాధాకృష్ణ, పి.వెంకటేశ్వరరావు, కె.హైమావతి, సీహెచ్.రాజేశ్వరరావు, సీహెచ్.శ్రీకాంత్, జాహ్నవి, బాలస్వామి, రాజేష్, రాజ్‌కుమార్, సునీత, మాధవి, శంకర్, రాజు, ధనలక్ష్మి 39 బాలలు సంరక్షకులు పాల్గొన్నారు.

## ఏలూరు నగరంలో ఎస్పీ అర్ధరాత్రి తనిఖీలు

ఏలూరు క్రైం, జూలై 16: ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన కొమ్మి ప్రతాప్ శివ కిశోర్ ఏలూరు నగంలో సోమవారం అర్ధరాత్రి తనిఖీలు చేశారు. సోమవారం ఉదయమే ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఆయన అర్ధరాత్రి ఏలూరు నగరాన్ని పరిశీలించారు. తెల్లవారుజాము 2 గంటల ప్రాంతంలో టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి స్టేషన్ ఇన్‌చార్జి ఏఎస్ఐ బ్రహ్మానందాన్ని నైట్ బీట్ల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. డ్యూటీ రోస్టర్ స్టేషన్‌లోని ఇతర రికార్డులను పరిశీలించారు. నగరంలోని టూటౌన్ ప్రాంతాలను సందర్శించి, బీట్ కానిస్టేబుళ్ల పనితీరును పరిశీలించారు. వన్‌టౌన్, రూరల్ ప్రాంతాలను కూడా ఆకస్మికంగా అర్ధరాత్రివేళ తనిఖీ చేశారు.

### టిప్పర్లకు ఇసుక రవాణా నిలిపివేత

కుక్కునూరు, జూలై 16: మండలంలో ఇసుక డిపోల నుంచి టిప్పర్ల ద్వారా ఇసుక రవాణా నిలిపివేయాలని తహసీల్దార్ అచ్యుతకుమారి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. వింజరం, ఇబ్రహీంపేటలో ఇసుక డిపోలు ఉన్నాయి. ఇబ్రహీంపేట నుంచి పలువురు ఇసుకను కొనుగోలు చేసి టిప్పర్లలో లోడు చేసుకుని తెలంగాణ ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్ముతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఆదివారం దాదాపు ఐదు టిప్పర్లలో ఇసుకలోడు చేసుకుని రాత్రిపూట ఇతర ప్రాంతాల్లో విక్రయించినట్లు ఆరోపణలు వచ్చాయి. మంగళవారం ఐదు టిప్పర్లు మళ్ళీ ఇబ్రహీంపేట ఇసుక డిపోకు వెళ్లడంతో పలువురు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దార్ వెంటనే స్పందించి ట్రాక్టర్లకు మాత్రమే ఇసుక అమ్మకాలు జరపాలని, టిప్పర్లకు ఇసుక ఎగుమతి నిలిపివేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఇబ్రహీంపేట ఇసుక డిపోలో మెట్రిక్ టన్ను ఇసుక రూ.210 ధరకు ఇస్తున్నారు. తక్కువ ధరకే ఇసుక లభించడంతో పలువురు ఇసుకను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి వ్యాపారంగా మారుస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

## ఉపాధి హామీ పథకం నిధులు
# రూ.4.89 కోట్లు దుర్వినియోగం
### రూ. 3.31 కోట్లు రికవరీ.. సిబ్బంది చేతివాటంతో నిధులు పక్కదారి



ఏలూరు సిటీ, జూలై 16: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 15 ఏళ్లలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో రూ.4.89 కోట్లు నిధులు దుర్వినియోగం కాగా ఇందులో ఇప్పటివరకు రూ. 3.31 కోట్లు నిధులు సంబంధిత వర్గాల నుంచి వసూలు చేశారు. సిబ్బంది చేతివాటం కారణంగా నిధుల దుర్వినియోగం జరుగుతోందనే విమర్శలు వినిపిస్తుండగా ఇతరత్రా కూడా కొన్ని రకాలుగా ఈ నిధులు దుర్వినియోగం జరిగే అవకాశాలున్నాయని చెబుతున్నారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో ఈ పథకం ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 15 ఏళ్లలో రూ.4.89కోట్లు దుర్విని యోగమైనట్లు సామాజిక తనిఖీ నివేదికలు చెబుతున్నాయి. ప్రధానంగా 4,421 మంది సిబ్బంది పాత్ర ఉందని తేల్చారు. ఇప్పటి వరకు జిల్లాలో రూ. 3.31 కోట్లు రికవరీ అయిందని, మిగిలిన నిధులలో రూ.70 లక్షలు నిధులు రికవరీ కావాల్సి ఉందని చెబుతున్నారు. ఈ నిధులు దుర్వినియోగం చేసినవారిపై ఆర్ఆర్ యాక్ట్ కింద చట్ట పరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుంద ని చెబుతున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 17 రౌండ్లు సామాజిక తనిఖీ జరిగిందని, ఇప్పుడు 18 రౌండ్ తనిఖీ నిర్వహిస్తున్నారని చెబుతున్నారు. నిధుల దుర్వినియోగంపై ప్రత్యేక దృష్టిసారించిన అధికారులు చర్యలు తీసుకుంటూనే ఉన్నారు. నిధుల దుర్వినియోగంలో రాజకీయ ప్రమేయం ఉండవ చ్చనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

### ఎప్పటికప్పుడు రికవరీ చేస్తున్నాం

ఉపాధి హామీ పథకం నిధుల దుర్విని యోగంపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. సామాజిక తనిఖీ నివేదికల అనుసరించి దుర్వినియోగమైన నిధులను సిబ్బంది నుంచి రికవరీ చేస్తున్నాం. మిగిలిన నిధులను కూడా రికవరీ చేయడం జరుగుతుంది. ఉపాధి హామీ పనులను పారదర్శకంగానే నిర్వహిస్తున్నా అక్కడక్కడా ఈ నిధులు దుర్వినియోగం జరుగుతోంది. ఇతర పనులు లేని సమయంలో ఉపాధి హామీ పథకంలో కూలీలకు పనులు కల్పించడం జరుగుతోంది. వేసవిలో ఈ ఉపాధి పనులకు ఎక్కువ శాతం మంది కూలీలు హాజరయ్యారు.

- ఎ.రాము, డ్వామా పీడీ

# అయ్యో పాపం.. ఎంపీడీవో



### మిస్సింగ్‌తో నరసాపురంలో కలకలం.. వైసీపీ రాజకీయాలకు బలి !
### రేవు పాటదారుడు బకాయి రూ.50 లక్షలు కట్టకపోవడంతో మానసిక ఒత్తిడి
### ఎమ్మెల్యే నాయకర్ భరోసా ఇచ్చినా ఆందోళన

నరసాపురం రూరల్, జూలై 16: నరసాపురం ఎంపీడీవోగా పనిచేసిన వెంకట రమణరావు విధి నిర్వహణలో పొరపాటుకు తావివ్వరు. ఎన్నికల సమయంలో బదిలీపై నర్సాపురం వచ్చారు. వైసీపీ రాజకీయ కుయుక్తుల్లో బలైపోయారు. ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించినప్పుడు పైఅధికారుల నుంచి ఎటువంటి ఒత్తిడి చేయలేదు. మరికొద్ది నెలల్లో పదవీ విరమణ చేయనుండడంతో అత్యంత జాగ్రత్తగా వెంకటరమణారావు బాధ్యతలు నిర్వహించారు. తప్పు చేసేందుకు అంగీకరించే వారు కాదు. కానీ స్థానికంగా రాజకీయ పరిస్థితులు అతనిని బలి చేశాయి. రేవు పాటలో నిర్వాహకుడు రెడ్డప్ప ధవేజీ ముందస్తు వ్యూహాన్ని పసిగట్టలేకపోయాడు. పాట నిర్వహణ పూర్తయినా సరే జాయింట్ యాక్షన్ కమిటీ మళ్లీ ధవేజీకే రోజు వారి సొమ్ము కట్టేలా రేవు బాధ్యతలు అప్పగించింది. గోదావరి రెండు వైపులా ఉండే అధికారులు, వైసీపీ ప్రజాప్రతినిధులతో కూడిన జాయింట్ యాక్షన్ కమిటీ సిఫారసుతో మళ్లీ ధవేజీకి రేవు బాధ్యతను అప్పగించారు. ఎన్నికల కోడ్ ఉందన్న ఉద్దేశంతో కొత్త పాట నిర్వహించలేదు, గతంలో పాట కాలం పూర్తయితే అధికారులే పర్యవేక్షించేవారు. పాటదారునికి తాత్కాలిక బాధ్యతలు అప్పగించినా సరే ఎప్పటికప్పుడు సొమ్ములు చెల్లించేలా చర్యలు తీసుకునేవారు. కృష్ణా జిల్లా నుంచి ఎంపీడీవోగా ఎన్నికల ముందు వచ్చిన వెంకట రమణరావుకు ఇక్కడ పరిస్థితులు బొత్తిగా తెలియవు. దాంతో ధవేజీని, వైసీపీ నేత ముదునూరి ప్రసాద్‌రాజుపై నమ్మకం పెట్టుకున్నారు. రోజువారీ రూ.1.05 లక్షల చెల్లించాల్సిన ధవేజీ క్రమేపీ రూ.50 లక్షల వరకు బకాయి పడ్డారు. పాట కాలం పూర్తయినప్పుడే గ్యారంటీ కోసం ఇచ్చిన దస్తావేజులను తీసుకున్నారు. ఆ తర్వాత ఎటువంటి పూచీకత్తు ఉందో తెలియదు. కేవలం వైసీపీ నేతల భరోసాతో ధవేజీకి మళ్లీ రేవు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. తీరా రూ.50 లక్షలు బకాయి పడిన ధవేజీ హైదరాబాద్ నుంచి రాలేదు. ముఖం చాటేశారు. మాజీ ప్రజా ప్రతినిధి ముదునూరి ప్రసాద్‌రాజు వద్దకు వెళ్లినప్పటికీ ఫలితం లేకపోయింది. ధవేజీ బకాయిపడ్డ రూ.50 లక్షలకు భరోసా లేకపోయింది. దీంతో ఎంపీడీవో భయపడ్డారు. ఎమ్మెల్యేగా కూటమి తరపున ఎన్నికైన నాయకర్ ఒక దశలో ఎంపీడీవో వెంకటరమణారావుకు భరోసా ఇచ్చారు. ధవేజీని మాత్రమే బాధ్యుడిని చేస్తామని, ఎంపీడీవోగా ఎటువంటి ఇబ్బంది ఉండదంటూ వెంకటరమణరావుకు ధైర్యాన్ని ఇచ్చారు. అయినాసరే రమణారావు సెలవుపై వెళ్లిపోయారు. ధవేజీకి రేవు నిర్వహణ బాధ్యతలు అప్పగించిన జాయింట్ యాక్షన్ కమిటీ బాధ్యత నుంచి తప్పుకుంది. రేవు నిర్వహణ సొమ్ములు చెల్లించడం లేదంటూ జిల్లా పంచాయతీ అధికారికి ఎంపీడీవో రమణారావు లేఖ రాసినా స్పందన లేకుండా పోయింది. చివరకు సెలవులో ఉన్న రమణారావు ఇంటినుంచి వెళ్లిపోవడం, చనిపోతానంటూ లేఖ రాయడం వంటి ఘటనలు నర్సాపురంలో తోటి సిబ్బందిని కలిచివేశాయి. (ప్రధాన వార్త మెయిన్‌లో)

# వేంకటేశ్వరునిగా జగన్నాథుడు



ద్వారకాతిరుమల : అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన వేంకటేశ్వరునిగా జగన్నాథుడు మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీనివాసుని దివ్యమంగళ స్వరూపంలో దర్శనమిచ్చిన జగన్నాథుడిని పలువురు దర్శించి పూజలు జరుపుకున్నారు. లక్ష్మీపురం ఆలయంలో జగన్నాథ రథోత్సవాలను పురస్కరించుకుని స్వామివారు దశావతారాల్లో రోజుకో అలంకరణలో భాగంగా ఉత్సవాల ముగింపు రోజైన మంగళవారం వేంకటేశ్వరుడి అలంకరణ ఆకట్టుకుంది.

### ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో

## ఉద్యోగాలకు దరఖాస్తులు

ఏలూరు రూరల్, జూలై 16: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ రిక్రూట్‌మెంట్ కోసం ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఎయిర్‌ఫోర్స్ అధికారి ఎస్.సందీప్, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో అగ్ని వీర్ వాయు రిక్రూట్‌మెంట్‌పై అధికారులు వివరాలు తెలిపి సంబంధిత మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ 18 నుంచి ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధంగా అన్ని కళాశాలల్లో పదిహేడు నుంచి ఇరవై ఒక్క ఏళ్ల వయస్సు ఉన్న విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. రిక్రూట్‌మెంట్ వైమానిక దళంలోకి ప్రవేశించేందుకు స్థిరమైన వృత్తిని దేశానికి సేవచేసే అవకాశాన్ని అందిస్తుందన్నారు. వెబ్‌సైట్ https://agnipathvayu.cdac.inలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ఆమె సూచించారు.

### ఏలూరు సీఆర్‌ఆర్‌లో 'అగ్నివీర్ పథకం'పై సదస్సు

ఏలూరు సర్.సి.ఆర్.రెడ్డి అటానమస్ కళాశాల ఆడియో విజువల్ హాల్లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్, ట్రైనింగ్, సెట్‌వెల్, కళాశాల ఎన్‌సీసీ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో భారత సైనిక విభాగానికి సంబంధించిన అగ్నివీర్ పథకంపై ఎన్‌సీసీ క్యాడెట్లు, ఇతర విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రామరాజు, కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారి టి.ప్రవీణ్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి కుష్టు వ్యాధిపై ఇంటింటా సర్వే

పాలకొల్లు , జూలై 16 : కుష్టువ్యాధి రహిత భారతదేశంగా 2027 నాటికి తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో జాతీయ కుష్టువ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ఈనెల 18వ తేదీ నుంచి ఆగస్టు 2 వరకు సంబంధిత శాఖ సిబ్బంది ఇంటింటా సర్వే చేపట్టనున్నారు. దీనిలో భాగంగా 2027 వరకు ప్రతీ ఏటా రెండుసార్లు ఇంటింటా సర్వే చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ సర్వే కార్యక్రమాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు స్థానిక డిప్యూటీ పారా మెడికల్ అధికారి జక్కంపూడి రామ ప్రసాద్ పర్యవేక్షణలో జరగనుంది. ఆరోగ్య కేంద్రాలు, ఆశాల ఆధ్వర్యంలో ఈ సర్వేతో ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయడం, అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టారు. ప్రతీ పాఠశాలకు వెళ్లి విద్యార్థులను పరీక్షించనున్నారు. వ్యాధి కారణాలు, లక్షణాలను విద్యార్థులకు వివరిస్తారు, విద్యార్థులను పరీక్షించి స్పర్శ, నొప్పి లేదా దురదలేని ఎర్రని, రాగి రంగు మచ్చలు ఉంటే ముందుగానే గుర్తించడం ద్వారా అంగ వైకల్యాన్ని నివారించేందుకు అవకాశం ఉంటుంది.





పూడ్చిన బోరుబావి.. అందుబాటులో ఉన్న అగ్నిమాపక కేంద్రం

## కోనపోతుగుంట బోరులో మళ్లీ సౌండ్‌లు

- ఓఎన్‌జీసీ అధికారుల పరిశీలన
- ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్థానికులకు స్పష్టత

ఆచంట, జూలై 16 : ఆచంట మండలం ఆచంట శివారు కోనపోతుగుంట బండి జయలక్ష్మి ఇంటి వద్ద ఉన్న బోరు బావిలో గతంలో సుమారు నాలుగేళ్ల క్రితం గ్యాస్ లీకేజీ సౌండ్ రావడంతో అప్పట్లో ఓఎన్‌జీసీ అధికారులు పర్యవేక్షణలో బోరు బావిని కాంక్రీటుతో పూర్తిగా పూడ్చి వేశారు. మళ్లీ అదే బోరు బావి నుంచి మంగళవారం సాయంత్రం గ్యాస్ మాదిరిగా లీకేజీ సౌండ్ రావడంతో మళ్లీ రాజమండ్రిలో ఉన్న ఓఎన్‌జీసీ అధికారులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాసరావు, నరసాపురానికి చెందిన ఓఎన్‌జీసీ అధికారులు, సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. స్థానికులు ఎటువంటి భయాందోళనలకు చెందాల్సిన అవసరం లేదని పూర్తిస్థాయిలో పరిశీలించి మరోసారి బోరుబావిని పూడ్చేందుకు ఓఎన్‌జీసీ అధికారులు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. అగ్నిమాపక కేంద్రాన్ని సిద్ధం చేసుకున్నారు. ఈ మేరకు స్థానికుల్లో మరోసారి ఆందోళన నెలకొంది. అయితే ఎటువంటి ప్రమాదం లేదని ఓఎన్‌జీసీ అధికారులు స్థానికులకు చెబుతున్నారు.

## నూజివీడు ప్రభుత్వాస్పత్రికి కేంద్ర బృందం



ఏరియా ఆసుపత్రిని పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

నూజివీడు, జూలై 16: నూజివీడు ఏరియా ఆసుపత్రిని మంగళవారం నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో 17 మంది కేంద్ర బృంద సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా పశ్చిమ బెంగాల్ వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నారాయణ స్వరూప్ నిగమ్, నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ సరోజ్‌కుమార్, మధ్యప్రదేశ్‌కు చెందిన నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ ప్రియాంక దాస్ ఏరియా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ పనితీరు, ఎన్‌సీడీ ప్రోగ్రామ్, కార్డియాక్ వైద్యంలో స్టెమ్ ఇంజక్షన్‌లు ఇస్తున్న విధానాలను పరిశీలించారు. రోగులను వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య సేవలపై వైద్యులను అభినందించారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ నరేంద్రసింగ్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డెక్కిన ఇసుక లారీలు

## టిప్పర్ లారీల సమ్మె విరమణ

- తూర్పుగోదావరి జిల్లాలో ఆధార్‌తో ఇసుక ఎగుమతులు
- వరద తగ్గితే ధర తగ్గే అవకాశం

పాలకొల్లు, జూలై 16 : ఇసుక ఎగుమతి ధర తక్కువే.. కిరాయి అధికం.. ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఇసుకను సరఫరా చేసే టిప్పర్ లారీలు సమ్మె విరమించి రోడ్డు ఎక్కాయి. ఐదు రోజులుగా సుమారు 1500 లారీలు సమ్మెలో పాల్గొనడంతో ఉమ్మడి పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల్లో ఇసుక సరఫరా నిలిచిపోయింది. తూర్పుగోదావరి జిల్లాలో ఇసుకను ఆధార్ కార్డుతో ఇవ్వడానికి సంబంధిత అధికారులు అనుమతించడంతో మంగళవారం నుంచి ఇసుక ఎగుమతులు ప్రారంభమయ్యాయి. ఔరంగబాద్ పడవ ర్యాంపు నుంచి మంగళవారం ఉదయం లాంఛనంగా ఇసుక ఎగుమతులు ప్రారంభించారు. పెండ్యాల, తీపర్రు, రావులపాలెం, స్టాక్‌పాయింట్‌ల నుంచి ఎగుమతి అవుతుంది. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు కృష్ణా జిల్లాకు అధికంగా ఇసుక తరలిస్తున్నారు. ధర తక్కువే.. స్టాక్ పాయింట్‌లలో టన్ను ఇసుక ధర రూ.270 ఉంది. అయితే ఐదు యూనిట్ల లారీకి 20 టన్నుల ఇసుక ఎగుమతి అవుతుంది. సుమారు 4.5 యూనిట్లు పరిమాణం కలిగి ఉంటుంది. గతంలో 5 యూనిట్లు ఇసుక ధర వినియోగదారునికి చేరే సరికి రూ.16 నుంచి 18 వేలుగా ఉండేది. ఇపుడు ఇసుక స్టాక్ పాయింట్‌లలో కొనుగోలు ధర 20 టన్నులు రూ. 5,400 గా ఉన్నప్పటికి కిరాయి తడిచిమోపెడైంది. స్టాక్ పాయింట్‌లలో ఎగుమతులకు వెళ్లిన ఇసుక లారీలు 2 లేదా 3 రోజులు వెయిటింగ్‌లో ఉండాల్సి రావడంతో వెయింటింగ్ పిరియడ్ సైతం లారీ యజమానులు కిరాయి వేసుకున్నారు. వాస్తవంగా ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఐదు యూనిట్లు ఇసుక దూరాన్ని బట్టి ఆయా ప్రాంతాలకు కిరాయితో కలిపి రూ. 10 లేదా 11 వేలకు చేరాలి. ఇప్పుడు లారీలు రోజులు తరబడి స్టాక్ పాయింట్‌లలో వెయింటింగ్‌లో ఉండడం కారణంగా రూ.10 వేలు కిరాయి తీసుకుంటున్నారు. అంటే కిరాయితో కలుపుకుని ఇసుక వినియోగదారనికి చేరు సరికి 5 యూనిట్లు రూ. 15 నుంచి 16 వేలు ఖర్చు అవుతుంది.



ఇసుక (ఫైల్)

**వరద తగ్గితే ధర తగ్గే అవకాశం**

గోదావరికి వరదలు తగ్గితే నేరుగా బాటలు ఏర్పాటు చేసి నదిలో ఇసుక ఎగుమతి చేసే అవకాశం ఉంటుంది. అపుడు లోడింగ్ చార్జి మాత్రమే ఖర్చు అవుతుంది. అప్పటికి ఇసుక ధర ఐదు యూనిట్లు వినియోగదారుడికి చేరే సరికి రూ.5వేల నుంచి రూ.6 వేలకు వచ్చే అవకాశం ఉందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

### ఉచితం ఊత పదమే.. !

ఉచిత ఇసుక విధానం అమల్లోకి వచ్చినప్పనటికి వినియోగదారునికి ఊరట లభించడం లేదు. ఎందుకంటే కిరాయి రెండు రెట్లు కావడంతో గత జగన్‌రెడ్డి పాలనతో ఇసుక ఎంత అమ్మారో ఇప్పుడూ అదే ధర పలుకుతుంది. దీంతో ఇసుక వినియోగదారులు పెదవి విరుస్తున్నారు. ఇసుక ఉచిత విధానాలు ఈవిధంగానే ఉంటే కూటమి ప్రభుత్వం అభాసుపాలయ్యే పరిస్థితులు ఉన్నాయి.

### 2014లో ఉచిత ఇసుక విధానం..

నవ్యాంధ్ర ఏర్పడిన దరిమిలా 2014లో అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు ఉచిత ఇసుక విధానం అమల్లోకి తెచ్చారు. అప్పటి పశ్చిమ గోదావరి జిల్లాలో ఐదు యూనిట్ల ఇసుక దూరాన్ని బట్టి రూ.4వేల నుంచి రూ.5 వేలకు లభించేది. నేరుగా బాటలు ఉండి లారీలు నదిలోకి వెళ్లే ర్యాంప్‌లలో కేవలం లారీ ఎగుమతికి రూ. 300 నుంచి రూ.500 ఖర్చు అయ్యేది. లారీ కిరాయి డ్రైవర్ బేటాలు అన్నీ కలిపినా కేవలం రూ. 4వేల నుంచి రూ.5 వేలకు ఐదు యూనిట్ల ఇసుక వచ్చేది. ఇపుడు ప్రభుత్వం స్టాక్ పాయింట్ వద్దకు ఇసుక చేర్చిన రవాణా చార్జీలు అక్కడ ఎగుమతి చార్జీలు కలిపి టన్నుకు రూ.270 వసూలు చేయడంతో 20 టన్నులకు రూ.5 వేల 400 ఖర్చు అవుతుంది. ఈ విధంగా లెక్కిస్తే కిరాయితో కలిపి రూ.15 వేలు పైబడి వినియోగదారులకు ఖర్చు అవుతుంది. ఐదు యూనిట్లుగా చెప్పబోతున్నుటికి 20 టన్నులకు నాలుగున్నర యూనిట్లు ఇసుక వస్తుంది.

### స్లాట్ విధానం అమలు చేయాలి

స్టాక్ పాయింట్‌లలో ఎగుమతికి వెళ్లిన ఇసుక లారీలు రోజులు తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా ఆన్‌లైన్ విధానంలో ఇసుక బుక్ చేసుకునే ఉండాలి. ఎగుమతికి స్లాట్ ఇస్తే ఇసుక లారీల కిరాయి తగ్గి వినియోగదారులకు ఐదు యూనిట్లకు రూ. 4 వేల నుంచి 5 వేలు మిగులుతుందని పరిశీలకులు సూచిస్తున్నారు.

# నేడు తొలి ఏకాదశి



ద్వారకాతిరుమల, జూలై 16: హిందూ సంప్రదాయంలో అత్యంత ప్రాముఖ్యత ఉన్న తొలి పండుగ తొలి ఏకాదశి. ఆషాఢ మాసంలో వచ్చే తొలి ఏకాదశి రోజున శ్రీమహావిష్ణువు క్షీరసాగరంలో యోగనిద్రకు ఉపక్రమిస్తారని పురాణగాదలు చెబుతున్నాయి. బుధవారం నుంచి చాతుర్మాసం ప్రారంభమవుతుంది. ఏడాది మొత్తం మీద వచ్చే 24 ఏకాదశులు ఏదో ఒక ప్రత్యేకతను సంతరించుకుంటాయి. ఏకాదశి అంటే 11 అని అర్థం. మనుకున్న ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు వీటిని పనిచేయించే అంతరేంద్రియం అయిన మనసు కలసి పదకొండు. ఇవన్నీ ఏకోన్ముఖంగా పనిచేసే సమయమే ఏకాదశి.

### తొలి ఏకాదశి విశిష్టత

ఆషాఢశుద్ధ ఏకాదశినే తొలి ఏకాదశి లేదా ప్రథమ ఏకాదశి లేదా హరివాసరం అని అంటారు. క్షీరాబ్ది నందు మహావిష్ణువు శేషపాన్పుపై శయనిస్తారు కావున శయన ఏకాదశి అనికూడా అంటారు. ఇది ప్రకృతిలో జరిగే మార్పులకు సంకేతంగా చెప్పొచ్చు. ఉత్తర దిశగా ఉన్న సూర్యుడు ఈరోజు నుంచి దక్షిణ దిశకు వాలుతున్నట్టు కన్పిస్తాడు. ఇది దక్షిణాయనాన్ని సూచిస్తుంది. చాతుర్మాస వ్రతం ఈరోజు నుంచి ప్రారంభిస్తారు. ఈవ్రతాన్ని ఈరోజు నుంచి కార్తీక మాస శుక్ల పక్ష ద్వాదశి వరకు అంటే క్షీరాబ్ది ద్వాదశి వరకు ఆచరించాలని పురాణాలు చెబుతున్నాయి.


### తొలి ఏకాదశి జరుపుకునే విధానం..

మహిమాన్వితమైన ఈ ఏకాదశి వ్రతాన్ని ఆచరిస్తే భూదాన మిచ్చునంత, అశ్వమేధయాగం చేసినంత, 60 వేల సంవత్సరాలు తపస్సు చేసినంత పుణ్యం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. ఈ తొలి ఏకాదశి నుంచే హిందువుల అన్ని పండుగలు ప్రారంభమవుతాయి.

### రైతు పండుగ కూడా..

ఇది ముఖ్యంగా రైతుల పండుగ. ఏరువాక లానే తొలి ఏకాదశి వేడుక చేసుకుంటారు. అతివృష్టి, అనావృష్టి లాంటి ప్రకృతి వైపరీత్యాలు చోటు చేసుకోకూడదని పైరుకు ఏరకమైన తెగుళ్లు సోకకూడదని మహావిష్ణువుకు నమస్కారం చేసుకుంటారు. తొలి ఏకాదశి రోజున మొక్కజొన్న పేలాలను మెత్తగా పొడి చేసి అందులో నూరిన బెల్లం కలపి దేవునికి నైవేద్యంగా సమర్పించి ప్రసాదంగా సేవిస్తారు.

## స్వల్పంగా తగ్గిన గోదావరి



స్పిల్‌వే వద్ద గోదావరి జలాలు

పోలవరం, జూలై 16 : పోలవరంలో గోదావరి నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి స్వల్పంగా తగ్గింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు గోదావ రి నదిలోకి కలుస్తున్న వరద జలాలను స్పిల్‌వే నుంచి ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేయడం వల్ల సాధారణ నీటిమట్టం మాత్రమే నమోదైంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 27.050 మీటర్లు, స్పిల్‌వే దిగువన 17.150 మీటర్లు, కాఫర్ డ్యాంకి ఎగువన 27.130 మీటర్లు, కాఫర్ డ్యాంకి దిగువన 16.220 మీటర్లు నమోదైనట్టు ఈఈలు పి. వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు.

### పట్టిసీమ నుంచి 5,310 క్యూసెక్కులు విడుదల

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 5,310 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను ప్రాజెక్టు కుడి కాల్వకు విడుదల చేశామని పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు మంగళవారం తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటిమట్టం 15.553 మీటర్లకు చేరుకుందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 15 పంపులు 15 మోటార్లతో నీటిని విడుదల చేసినట్టు తెలిపారు. ఈనెలలో ఇప్పటివరకు 6.2057 టీఎంసీల నీటిని విడుదల చేసినట్టు తెలిపారు.

## గుండెపోటుతో సీనియర్ అసిస్టెంట్ సత్యరాజు మృతి



సత్యరాజు(ఫైల్)

లింగపాలెం, జూలై 16:లింగపాలెం మండలం ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పరసా సత్యరాజు(53) మంగళవారం ఉదయం గుండెపోటుతో మరణించారు. ఆయన మరణవార్త తెలుసుకున్న ఏపీఎన్జీవో సంఘ నాయకుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఎన్జీవో నాయకులు, ప్రముఖులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఎన్జీవో నాయకుడు అబ్రార్ హుస్సేన్, మురళీమోహన్, రాజు, వి.రమేష్, సంపత్, కుమారి తదితరులు పాల్గొన్నారు.

## గోపీనాథపట్నం కంపెనీలో దొంగతనం

ఉంగుటూరు, జూలై 16 : ఉంగుటూరు మండలం గోపీనాథపట్నంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఈనెల 14వ తేదీ రాత్రి దొంగతనం జరిగింది. కంపెనీలో రూ.3,44,961 నగదు దొంగతనం జరిగిందని కంపెనీ టీం లీడర్ బోడపాటి మహేష్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ ఎ.మణికుమార్ తెలిపారు.

## పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

ముదినేపల్లి, జులై 16: అయిదేళ్ల క్రితం బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి మచిలీపట్నం పోక్సో కోర్టు జడ్జి జి.వెంకటేశ్వర్లు మూడేళ్ల జైలు, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు ఇచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం 2018 అక్టోబరు 25న ముదినేపల్లి మండలం లోని ఒక గ్రామంలో బాలికకు మా యమాటలు చెప్పి అదే గ్రామానికి చెందిన సునీల్ కుమార్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీనిపై బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ వి.రాజేంద్ర ప్రసాద్ పోక్సో కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి పలువురు సాక్షులను విచారించిన అనంతరం మంగళవారం జడ్జి తీర్పునిచ్చినట్లు కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్, ముదినేపల్లి ఎస్‌ఐ వెంకట్‌కుమార్ తెలిపారు.

## భారంగా అంగన్‌వాడీ కేంద్రాలు

- మెనూ అమలు చేయలేక నిర్వాహకుల పాట్లు
- కూటమి ప్రభుత్వమైనా పట్టించుకోవాలని విజ్ఞప్తి



అత్తిలి, జూలై 16: మాతా శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ భారంగా మారిందని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో పాలకులు ఇచ్చిన హామీలు హామీలుగానే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనాల అద్దె కూడా ఏ నెలకానెల చెల్లించలేని దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

### పెరిగిన ఖర్చులతో మెనూ అమలెలా ?

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే ప్రి స్కూలు పిల్లలకు వండి పెట్టేందుకు ఆకుకూరలు, కూరగాయలు, టమోటా వంటివి రోజువారీ కొనుగోలు చేయాల్సి వస్తోంది. వీటితో పాటు కారం, చింతపండు, పసుపు, పోపు సామాన్లు ఎప్పటికప్పుడు సిద్ధం చేసుకోవాలి. వీటి కొనుగోలుకు ప్రభుత్వం ఇస్తున్న నిధులు ఏ మాత్రం సరిపోకపోవడంతో మెనూను అమలు చేయలేని పరిస్థితి నెలకొంది. పిల్లల్లో ఒక్కొక్కరికి బియ్యం 75 గ్రాములు, కందిపప్పు 15 గ్రాములు, వంట నూనె 5 గ్రాముల చొప్పున ఇస్తున్నారు. పోపుల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.1.50 చొప్పున కేటాయిస్తున్నారు. ప్రస్తుతం పెరిగిన కూరగాయల ధరలతో వండి పెట్టడం భారంగా మారిందని, సొంత సొమ్ము వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్‌కు 50 పైసలు చొప్పున చెల్లిస్తున్నారని, ఒక్కొక్క గ్యాస్ సిలిండర్‌ను రూ. 900 పెట్టి కొనుగోలు చేస్తున్నామని అయితే ప్రభుత్వం ఇచ్చేది రూ. 700 మాత్రమేనని చెబుతున్నారు. తణుకు ఐసీడీఎస్ కేంద్రంలోని 233 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాలను పర్యవేక్షించాల్సిన అధికారులు మెనూ సక్రమంగా అమలు చేస్తున్నారా లేదా అనేది ఎప్పటికప్పుడు చూడాల్సిన బాధ్యత ఉంది. కార్యకర్తలు ఒక్కసారిగా ధరలు పెరగడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి ఉండడంతో ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ సక్రమంగా అమలు కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

క్రైం కార్నర్

# వామ్మో.. దొంగలు

- పెనుమంట్ర మండలంలో పెరిగిన చోరీలు
- కొరవడిన నిఘా.. తాళంవేసిన ఇళ్లే టార్గెట్
- బంగారం, వెండి, నగదు చోరీ







చిందర వందరగా పడివున్న వస్తువులు.. వేలి ముద్రలు సేకరిస్తున్న నిపుణులు (ఫైల్)

పెనుమంట్ర, జూలై 16 : పెనుమంట్ర మండలంలో గత పదిహేను రోజుల వ్యవధిలో వరసగా మూడు దొంగతనాలు జరగడంతో ప్రజలు వామ్మో దొంగలు ఇంటికి తాళాలు వేస్తే దోచేస్తున్నారు అంటూ భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఇటీవల నత్తా రామేశ్వరం, పొలమూరు బ్రాహ్మణ చెరువు గ్రామాల్లో వరుస దొంగతనాలు జరగడంతో ప్రజలు భయపడుతున్నారు. నత్తా రామేశ్వరంలోని కిరాణా వ్యాపారం చేస్తున్న షావుకారు ఇంటిలో చోరీ జరిగిందని, సుమారు ఐదు లక్షల విలువైన బంగారు ఆభర ణాలు తస్కరించుకుపోయారని చెబుతున్నారు. గతవారం పెనుమంట్ర మండలం పొలమూరులో కడలి సత్యనారాయణ మాస్టారు శనివారం, ఆదివారం సెలవు రావడంతో ఇంటికి తాళాలు వేసి ఊరికి వెళ్లి వచ్చేసరికి ఇంటిలో ఉన్న బంగారు ఆభరణాలు రూ.50 వేల నగదు, టీవీ, హోమ్ థియేటర్, వెండి వస్తువులు చోరీకి గురి కావడంతో పోలీసులను ఆశ్రయించారు. క్లూస్ టీం వేలిముద్రలు సేకరించినప్పటికీ కేసులో పురోగతి లేదు. ఆదివారం బ్రాహ్మణ చెరువులో ఇంటికి తాళం వేసి తోడు కోడలు ఇంటిలో నిద్రించేందుకు వెళ్లి ఉదయం వచ్చేసరికి తలుపులు బద్దలు కొట్టి బీరువాలోని బంగారం, డబ్బు, వెండి వస్తువులు దోచుకుపోయారు. బ్రాహ్మణ చెరువులోని రాజశేఖర్‌రెడ్డి కాలనీకి చెందిన మహిళ మైలాబత్తుల ధనలక్ష్మికి చెందిన ఆరున్నర కాసుల బంగారం, పదిహేను తులాల వెండి, ఏడు వేల రూపాయలు నగదు దొంగిలించకపోయారు ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్లూస్ టీం సిబ్బంది వేలి ముద్రల సేకరించారు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెబుతున్నారు. ఇవే కాకుండా ఇంటి బయట పార్కింగ్ చేసిన మోటార్ సైకిళ్లు, రొయ్యల చెరువుల వద్ద మోటార్ ఇంజన్లు, వైర్లు చోరీకి గురయ్యాయి. ఏ కేసులోనూ పురోగతి లేదు. మండలంలోని ప్రజలు రాత్రి అయ్యేసరికి ఏ మూల నుంచి ఏ వార్త వినవలసి వస్తుందోనని భయపడిపోతున్నారు. పోలీస్ శాఖ అధికారులు రాత్రి వేళల్లో గస్తీ తిరుగుతున్నప్పటికీ చోరీలు జరగడంతో పోలీసులు నిఘా కొరవడిందని విమర్శలు వినిపిస్తున్నాయి. రెండేళ్ల క్రితం పెనుమంట్ర గరువులో హైదరాబాద్ వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంట్లో ఉన్న బంగారం భారీగా దోచుకుపోయారు. అప్పుడు ఎస్పీ స్వయంగా వచ్చి దర్యాప్తు చేశారు. ఈ కేసులో రికవరీ జరగకపోవడం విమర్శలకు తావిస్తోంది. దొంగతనాలు జరిగిన ప్రాంతాల్లో పోలీసులు కేసులు నమోదు చేసి మొక్కుబడిగా దర్యాప్తు చేస్తున్నారని విమర్శలు బహిరంగంగానే చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని పూర్తిస్థాయిలో రికవరీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## స్నేహితులతో ఆడుకోవడానికి వెళ్లి..

- విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి



ప్రసాద్ మృతదేహం

పోలవరం జూలై 16 : సరదాగా స్నేహితులతో ఆడుకోవడానికి వెళ్లి విద్యుదాఘాతంతో ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన పోలవరంలో మంగళవారం ఉదయం జరిగింది. పోలవరం ఎస్‌ఐ పవన్ కుమార్ తెలిపిన వివరాలివి.. పాత పోలవరానికి చెందిన కోవేటి ప్రసాద్(11) పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. కడమ్మ స్లూయి జ్ వద్దకు తన స్నేహితులతో వెళ్లి స్లూయిజ్ వద్ద బహిర్భూమికి వెళుతూ తెగిపడి ఉన్న విద్యుత్ వైరుని పట్టుకోవడంతో షాక్‌కి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విద్యార్థి తండ్రి పోసియ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ ఏఈ కొండా సత్యనారాయణను వివరణ కోరగా విషయం తెలిసిన వెంటనే తమ సిబ్బంది ఘటనా ప్రాంతానికి వెళ్లి సరఫరా నిలిపివేశారన్నారు. న్యూట్రల్ వైరు తెగిపడడం వల్ల ప్రమాదం సంబవించిందన్నారు. బాలుడి కుటుంబానికి విద్యుత్ శాఖ తరపున నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## చికిత్స పొందుతూ వివాహిత మృతి

ఆచంట, జూలై 16 : కోడేరు శివారు ఉత్తరపాలెంలో వివాహిత శీలం నాగలక్ష్మి(25) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ ఎం.రాజ్‌కుమార్ తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన శీలం నాగలక్ష్మికి ఇటీవలే సిద్ధాంతంకు చెందిన సాయిబాబాతో వివాహ మైంది. ఆషాఢమాసం నిమిత్తం పుట్టింటికి రాగా ఈనెల 13న ఇంటి వద్ద పురుగుల మందు తాగడంతో వెంటనే కుటుంబ సభ్యులు భీమవరం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. భర్త వేధింపుల కారణంగానే ఆమె పురుగు మందుతాగినట్టు సమాచారం. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

## వరకట్నం వేధింపులపై కేసు

భీమవరం క్రైం, జూలై 16 : తన భర్త, అత్తమామలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వన్‌టౌన్ ఎస్‌ఐ మణమ్మ తెలిపిన వివరాలివి.. భీమవరం 4వ వార్డుకు చెందిన కాటికి జయకుమారికి భీమవరం మండలం గూట్లపాడు గ్రామానికి చెందిన కాటికి యేసురాజుకు కొంతకాలం క్రితం వివాహమైంది. కొద్దిరోజులుగా భర్త యేసురాజు అత్త, మామ అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ మంగళవారం ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

### చెల్లని చెక్కులిచ్చిన నిందితుడికి

## ఆరు నెలల జైలు, రూ.2 లక్షల జరిమానా

నూజివీడు టౌన్, జూలై 16: చెల్లని చెక్కు కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష, రూ. 2లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. నూజివీడు పట్టణానికి చెందిన వ్యాపారి రాసాబత్తుల వెంకట్రావు 2016 జూలైలో విశాఖపట్నానికి చెందిన ఎడ్ల వెంకటేశ్వరరావుకు రూ.3 లక్షలు అప్పుగా ఇచ్చాడు. బాకీ తీర్చమని వెంకట్రావు అడగ్గా వెంకటేశ్వరరావు రూ. లక్షా 50 వేలకు మూడు చెక్కులు ఇవ్వగా అవి చెల్లుబాటు కాలేదు. ఈ నేపథ్యంలో వెంకట్రావు కోర్టులో కేసు దాఖలు చేయగా, నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి కేసును విచారించి నిందితుడు వెంకటేశ్వరరావుకు జైలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

## వెల్డింగ్ చేస్తూ కింద పడి ఒకరి మృతి

ఆకివీడు, జూలై 16 : ఐరన్ షాపునకు వెళ్లి వెల్డింగ్ చేస్తూ పైపును కట్ చేస్తుండగా కింద పడి మృతి చెందిన ఘటన ఆకివీడులో జరిగింది. ఎస్‌ఐ బత్తిన నాగబాబు తెలిపిన ప్రకారం.. ఆకివీడు సంతమార్కెట్ ప్రాంతానికి చెందిన ఏలూరి వెంకన్న(43) వెల్డింగ్ పనిచేస్తూ జీవిస్తున్నాడు. మంగళవారం కొత్తబస్టాండ్ సమీపంలో వున్న ఓ షాపునకు వెళ్లి ఐరన్ పైపు వెల్డింగ్ చేస్తూ కట్ చేస్తూ కిందపడిపోయాడు. సత్వరమే ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. భార్య కిరణ్‌కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

## బాలికపై అత్యాచారం

- యువకుడితో పాటు మరో ముగ్గురిపై పోక్సో కేసు

టి.నరసాపురం, జూలై 16: ఇంటర్ చదువుతున్న బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకుడితో పాటు అతడికి సహకరించిన మరో ముగ్గురిపై పోక్సో కేసు నమోదు చేసిన ఘటన టి. నరసాపురం మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలిక జంగారెడ్డిగూడెం ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ పూర్తి చేసి ఇంటివద్దే ఉంది. అదే గ్రామానికి చెందిన యువకుడు తాడి నాగకుమార్ స్థానికంగా హైస్కూల్‌లో చదివే సమయంలో ప్రేమపేరుతో బాలిక వెంటపడి ప్రేమించినట్టు సమాచారం. ఈ క్రమంలో 2023 ఆగస్టులో జంగారెడ్డిగూడెం హాస్టల్లో ఉంటూ చదువుతున్న బాలిక సెలవులకు ఇంటికి వచ్చి తిరిగి వెళ్ళగా హాస్టల్ తెరవకపోవడంతో విషయం తెలుసుకున్న యువకుడు జంగారెడ్డిగూడెం వెళ్లి బాలికను గ్రామానికి తీసుకువచ్చి రాత్రి స్థానిక సచివాలయంలో ఉంచి శారీరకంగా అనుభవించాడు. అనంతరం ఈనెల 6వ తేదీ రాత్రి యువకుడు బాలికకు ఫోన్‌చేసి మాట్లాడాలని చెప్పి మరో యువకుని సాయంతో ఆ బాలికను సచివాలయం వద్దకు తీసుకువచ్చారు. అక్కడ ఉన్న మరో ఇద్దరు యువకుల సాయంతో ఏలూరు రైల్వేస్టేషన్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి నిందితుడు బాలికను రైల్లో వైజాగ్ తీసుకెళ్లి ఓ హోటల్లో పలుమార్లు శారీరకంగా అనుభవించాడని తెలిసింది. అనంతరం ఇంటికి తీసుకువచ్చి దింపి వెళ్లిపోయాడని బాలిక ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## మహిళ అదృశ్యం.. కేసు నమోదు

లింగపాలెం, జూలై 16: తువ్వచిలుకరాయుడుపాలెం గ్రామానికి చెందిన ఓ మహిళ కనిపించడం లేదంటూ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పి.చెన్నారావు తెలిపారు. గ్రామానికి చెందిన వలసపల్లి వెంకటలక్ష్మి అనే మహిళ గత ఏప్రిల్ 11వ తేదీన ఏలూరులోని ఆసుపత్రికి వెళుతున్నానని ఇంటిదగ్గర నుంచి బయలుదేరి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ కానరాలేదు. మంగళవారం కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

## చెరుకువాడలో వ్యక్తి అదృశ్యం.. కేసు

ఉండి జూలై 16: ఓ వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఉండి పోలీసులు తెలిపారు. మంగళవారం రాత్రి ఉండి మండలం చెరుకువాడకు చెందిన ఏలేటి విజయలక్ష్మి తన భర్త కృపావరం 2017 ఆగస్టు 7వ తేదీ నుంచి సుమారుగా ఏడేళ్లుగా నుంచి కనిపించడం లేదని ఆమె ఫిర్యాదు చేసింది. తన భర్తకు మతిస్థిమితం లేదని ఆమె తెలిపింది. బయటకు వెళ్లి వస్తుంటాడని అదేరీతిలో వస్తాడనుకుని చూస్తున్నాం.. ఇప్పటివరకు తమ వద్దకు రాలేదని ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ లక్ష్మణ్ తెలిపారు.

## స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుల నియామకం


నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూ టౌన్, జూలై 16: నగర పాలక సంస్థ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులుగా సాయిరమేష్, ఎ.వెంకటనారాయణను నియమిస్తూ మున్సిపల్ కమిషనర్ వెంకటకృష్ణ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరి ఇరువురికి ఎమ్మెల్యే బడేటి చంటి నియామక ఉత్తర్వులను అందజేశారు. వీరి పదవీ కాలం మూడేళ్లు ఉంటుంది.

## ఆర్య వైశ్య పేదలకు ఉద్యోగాలు కల్పించండి


ఎంపీ మహేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న బ్రహ్మయ్య

ఏలూరు టూ టౌన్, జూలై 16 : ఆర్య వైశ్యలలో పేదలైన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఎంపీ మహేష్ యాదవ్‌ను కోరుతూ ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చలువాది బ్రహ్మయ్య ఎంపీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. బ్రహ్మయ్య మాట్లాడుతూ ఎంతోమంది ఆర్యవైశ్యులు గుమస్తాలుగానే జీవిస్తున్నారని అన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే బడేటి కోట రామారావు 11 రోజుల అపర కర్మల కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి స్థలం కేటాయించారని అన్నారు. ఆ స్థలంలో షెడ్లు నిర్మించాలని, ఏలూరులో అన్ని రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మద్దుల పవన్, తదితరులు ఉన్నారు.

## ముత్తారెడ్డికి మాగంటి బాబు పరామర్శ



చింతలపూడి, జూలై 16: సీనియర్ టీడీపీ నాయకుడు జగ్గావరపు ముత్తారెడ్డికి హైదరాబాద్‌లో ఏఐజీ ఆసుపత్రిలో బైపాస్ సర్జరీ జరిగింది. హైదరాబాద్‌లో ఆయన కుమారుడి ఇంటి వద్ద ఉన్న ముత్తారెడ్డిని మాజీ మంత్రి మాగంటి బాబు మంగళవారం పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు.

## రుణమాఫీ బకాయిలు విడుదల చేయాలి

నిడమర్రు జూలై 16 : వైసీపీ ప్రభుత్వ హయాంలో 2022 నుంచి నిలిచిపోయిన రైతు రుణ మాఫీ బకాయిలను తక్షణం విడుదల చేయాలని ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి వెలగలేటి మోహన డిమాండ్ చేశారు. నిడమర్రు డిప్యూటీ తహసీల్దార్ శేఖర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కె.రాజు, ఎం.బాబిరాజు, సీహెచ్.సూరి, ఎన్.రమణారావు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జంగారెడ్డిగూడెం, జూలై 16 : పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశం సంఘ జిల్లా అధ్యక్షుడు కె.వి.ఫ్లీష్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కృష్ణ చైతన్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ త్వరగా అందజేయాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా, మండల కార్యదర్శులు కంకిపాటి బుచ్చిబాబు, కుంచే వసంతరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జేవీ రమణరాజు పాల్గొన్నారు.

## జీపీఎస్ జీవో నిలుపుదల పై హర్షం

ఏలూరు రూరల్, జూలై 16: జీపీఎస్ జీవో నోటిఫికేషన్ నిలుపుదల చేయడంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం బలవంతంగా తీసుకువచ్చిన జీపీఎస్ జీవో పై ఉద్యోగులు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారన్నారు. సీఎం చంద్రబాబు, దీని పై విచారణకు ఆదేశించడం అభినందనీయమన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక


నగర శ్రీ శయన సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

ఏలూరు రూరల్, జూలై 16: నగర శ్రీశయన కుల సంక్షేమ సంఘం సమావేశం సెంట్రల్ కమిటీ నాయకుడు రాంబాబు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా నగర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కోలా కనకారావు, సలహాదారుగా ఓలుపల్లి చంద్రశేఖర్, అధ్యక్షుడిగా లొట్టి రమేష్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఉమామహేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా టి.శ్రీనివాస్, కోశాధికారిగా రాజు, ఉపాధ్యక్షులుగా మోహన్‌రావు, లొట్టి త్రినాథ్, మోహన్ రావు, సహాయ కార్యదర్శిగా జగదీష్, బాలు, బాలసుబ్రహ్మణ్యంను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర టీడీపీ సాధికారిక కమిటీ అధ్యక్షులు పట్నాల వెంకటేష్ బాబు, లోడా అప్పారావు, గాడి బాలాజీ, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

## రక్షిత మంచి నీరు అందించండి


వాటర్ ట్యాంకు వద్ద పరిశీలిస్తున్న డీపీవో విశ్వనాథ్

జీలుగుమిల్లి, జూలై 16 : గిరిజన గ్రామాల్లో డెంగీ డయేరియా వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు సురక్షిత మంచి నీరు అందించాలని, పారిశుధ్య చర్యలు చేపట్టాలని డీపీవో టి.శ్రీనివాస విశ్వనాథ్ సిబ్బందిని ఆదేశించారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా మంగళవారం తాటియాకులగూడెంలో డీపీవో ఆకస్మికంగా పర్యటించి మంచినీటి ట్యాంకును పరిశీలించారు. ఆగస్టు 30 వరకు స్టాప్ డయేరియా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కలెక్టరు ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసి క్షేత్ర స్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈవోపీఆర్డీ నిఖిల్, కార్యదర్శి వీరలక్ష్మి, జి.నాగేశ్వరరావు ఉన్నారు.

## దోమల నిర్మూలనే లక్ష్యం


దోమల లార్వా స్ప్రే చేస్తున్న సిబ్బంది

ఏలూరు టూ టౌన్, జూలై 16: నగరంలో దోమల నిర్మూలనే లక్ష్యంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రెడ్డి మాలతి తెలిపారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా పోణంగిలో మంగళవారం ఫాగింగ్ చేపట్టి, నీటిలో ఆయిల్ బాల్స్ వేశారు. మలేరియా ఇన్ స్పెక్టర్ వేణుగోపాలస్వామి, దుర్గారావు, శ్రీనివాసరావు, సచివాలయ, పారిశుధ్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## శివపురంలో స్కూల్ భవనం నిర్మించాలి

చింతలపూడి, జూలై 16 శివపురంలో స్కూల్ భవనం నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో 1985లో యూపీ స్కూల్ ప్రారంభించారు. ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు సుమారు 150 మంది చదువుకునే వారు. అయితే 2008లో తమ్మిలేరు వరద ముంపు వల్ల గ్రామంలో వరద చేరి ఈ పాఠశాల చుట్టూ ఉన్న ఇళ్లు నీట మునిగాయి. అక్కడ నివసించే గ్రామస్తులు ఊరికి దూరంగా నివాసాలు ఏర్పరుచుకున్నారు. అయితే పాఠశాల మాత్రం అక్కడే నిర్వహిస్తున్నారు. పాఠశాల దూరం కావడంతో సరిహద్దులో ఉన్న కృష్ణా జిల్లాలోని గ్రామాలకు విద్యార్థులు తరలిపోతున్నారని, గ్రామస్తుల ఆర్థిక సాయంతో గ్రామం మధ్యలో 50 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఈ స్థలంలో పాఠశాల భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, వరద ముంపు ప్రాంతంలో ఉన్న ఆ పాఠశాలను గ్రామం మధ్యలోకి తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఉపాధి పనుల్లో చేతివాటం

- మస్టర్లలో సిబ్బంది మాయాజాలం
- ప్రక్షాళనకు గ్రామ సభల నిర్వహణ
- సర్పంచ్‌లు డుమ్మా

**గ్రామీణ ప్రాంత కూలీలకు వంద రోజుల పని కల్పించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్‌జీఎస్)లో పనులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. అయితే పథకంలోని డొల్లతనాలను కొంతమంది సిబ్బంది తమకు అనుకూలంగా మార్చుకొని అందిన కాడికి దోచుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి.**



పెదపాడు, జూలై 16 : ఉపాధి అర్హత గల పనులను గుర్తించడం, వాటిని క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా నిర్వహించడంపై ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని, దీంతో అక్రమార్కుల్లో కొంతమంది క్షేత్ర స్థాయి సిబ్బంది నీకింత, నాకు కొంత అనే ధోరణిలో నగదును పంచుకుంటున్నారని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉపాధి కూలీలుగా పేర్లు నమోదు చేయించుకుని పనికి రాకున్నా వారికి హాజరు వేయడం, అలా వచ్చిన వేతనం మొత్తాన్ని వారు చెరి సగం పంచుకోవడం జరుగుతున్నది బహిరంగం రహస్యమే. లక్షలాది రూపాయలు వేతనాలుగా చెల్లించి గ్రామాల్లో పనులు చేపట్టినా గ్రామాభివృద్ధికి, గ్రామావసరాల కోసం పనికొచ్చే పనులను గుర్తించడంలో కూడా సిబ్బంది విఫలమయ్యారనే విమర్శలూ ఉన్నాయి. ఇంచుమించు మండలంలోని అన్ని గ్రామాల్లో మస్టర్లలో సిబ్బంది మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. ఉపాధి హామీ పథకం పనుల్లో జరిగిన అవినీతిని వెలికితీసేందుకు మంగళవారం నుంచి ప్రతి గ్రామంలోనూ గ్రామ సభలు జరగనుండగా, ఆయా గ్రామ సభల్లో వీటిని గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

### మొహం చాటేసిన సర్పంచ్‌లు

ఉపాధి హామీ పథకం పనులపై సమీక్షించేందుకు నిర్వహించబోయే గ్రామసభలపై అవగాహన కల్పించేందుకు పెదపాడు ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో అధ్యక్షతన గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఎన్ఆర్‌జీఎస్ సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఒకరిద్దరూ సర్పంచ్‌లు మినహా మిగతా వారంతా మొహం చాటేశారు. గ్రామాల్లో చేపట్టిన పనులు, నగదు చెల్లింపుల్లో ఏమైనా లోటు పాట్లు ఉంటే ముందుగానే తెలియజేసి గ్రామసభల్లో సరి చేసుకోవాలని లేకపోతే శాఖాపరమైన చర్యలకు గురవుతారంటూ సమావేశంలో చెప్పడం కొసమెరుపు. పీఆర్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం

ఏలూరు రూరల్, జూలై 16: సామాజిక తనిఖీ సక్రమంగా చేయాలని, ఏలూరు ఎంపీడీవో బండి ప్రణవి అన్నారు. ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో సోషల్ ఆడిట్, ఉపాధి హామీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 2023-24కి సంబంధించి రూ.15 కోట్ల 83 లక్షల పనుల పై సామాజిక తనిఖీ చేపడుతున్నట్లు చెప్పారు. రాష్ట్ర రీసోర్స్ పర్సన్ సూర్యచక్రం మాట్లాడుతూ మండలంలో 14 పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనుల పై సోషల్ ఆడిట్ నిర్వహించి, గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఆడిట్ చేయటం జరుగుతుందని, సంబంధిత శాఖల అధికారులు సోషల్ ఆడిట్ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఏపీవో కిషోర్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్, డీఆర్పీలు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రీసోర్స్ పర్సన్ సూర్యచక్రం

## ఉపాధి బకాయిలు చెల్లించాలని డిమాండ్

బుట్టాయగూడెం, జులై 16 : నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల బకాయిలను వెంటనే చెల్లించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అందు గుల ఫ్రాన్సిస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బకాయిలను చెల్లించాలని కోరుతూ మంగళవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట కూలీలతో కలిసి ధర్నా చేశారు. కూలీలకు డబ్బులు అందక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కూలీలకు పనిముట్లు ఇవ్వాలని, పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. బి.డేవిడ్‌రాజ్, వరకరాజు, వెంకటేశ్వరావు, సామ్యూల్ పాల్గొన్నారు.

## తూడు తొలగింపు పనుల పరిశీలన


తూడు తొలగింపు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఉంగుటూరు, జూలై 16 : కురుస్తున్న వర్షాలకు బాదంపూడి జాతీయ రహదారి పక్కన ఉన్న పంట పొలాలు నీట మునిగాయి. దీంతో వెల్లమిల్లి వచ్చిన ఎంపీ, ఎమ్మెల్యేలకు రైతులు విన్నవించగా పరిశీలించి మంగళవారం కూలీలతో తూడును తీయించారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు దగ్గర ఉండి పనులను పరిశీలించారు. నాచుగుంట, వెల్లమిల్లి, బాదంపూడికి చెందిన సుమారు 450 ఎకరాల పంటకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకున్నట్లయింది.

● జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వాలలో నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో జరిగిన క్రియాశీల సభ్యత్వాల సమావేశంలో పాల్గొన్న ఆయన మండలాల వారీగా వివరాలు సేకరించారు. ప్రమాదాల బారిన పడిన సభ్యుల కుటుంబాలకు పరిహారం చెక్కులను అందజేశారు.

● కుక్కునూరు : జనసేన క్రియ శీలక సభ్యత్వం నమోదు చేసుకోవాలని మండల పార్టీ అధ్యక్షుడు ములిశెట్టి యుగంధర్ ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 28వ తేదీ వరకు నమోదు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. సభ్యులందరికీ ప్రమాద బీమా ఉంటుందని తెలిపారు. నాయకులు యుగంధర్, వెంకన్నబాబు, సీతారామయ్య, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావును సభ్యత్వానికి సంప్రదించాలన్నారు.

## ఆరోగ్య సంరక్షణ అందరి బాధ్యత


డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి, జూలై 16 : ప్రజల ఆరోగ్య సంరక్షణ అందరి బాధ్యత కావాలని, వీధులను శుభ్రంగా ఉంచడంతోపాటు డ్రెయిన్లలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. మీకోసం- మీచింతమనేని కార్యక్రమంలో భాగంగా వేగివాడ, చక్రాయగూడెం, ముండూరులో మంగళవారం పర్యటించిన ఎమ్మెల్యే పారిశుధ్యం నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాకాలంలో మరింత అప్రమత్తంగా ఉంటూ ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. ప్రజల సంక్షేమానికే తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వేగివాడ సర్పంచ్ పంది ప్రభావతి సూర్య చంద్రరావు, పార్టీ నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, నున్నా జానకీ రామ్, కొనకళ్ల శివమణి, మాదు రవికుమార్, దొరరాజు శ్రీనివాసరాజు, అన్నపనేని సురేష్, బలుసు శ్రీనివాస్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

### అప్పనవీడులో అన్న సమారాధన

పెదపాడు, జూలై 16 : అప్పనవీడు అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద మంగళవారం దాతల సహకారంతో అన్న సమారాధన నిర్వహించినట్లుగా ఈవో కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు.

# కౌలు రైతులకు రూ.2 వేల కోట్లు కేటాయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏవో

ఏలూరు కార్పొరేషన్, జూలై 16 : జిల్లా వ్యవసాయ పంట రుణ ప్రణాళికలో కౌలు రైతులకు రూ.రెండు వేల కోట్లు కేటాయించాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పవరుపేటలోని అన్నేభవనం వద్ద రైతు సంఘ ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో నూటికి 70 శాతం భూములు సాగు చేస్తున్నది కౌలు రైతులే అన్నారు. మంత్రి ఆదేశాల మేరకు భూ యజ మానులతో సంబంధం లేకుండా కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు ఇచ్చి పంట రుణాలు ఇవ్వాలన్నారు. సంఘ నాయకులు కె.అప్పారావు, కేశవ ఉన్నారు.

### కౌలు రైతులకు కార్డులు అందజేత

ఉంగుటూరు, జూలై 16 : అక్కుపల్లి గోకవరంలో వ్యవసాయాధికారులు కౌలు రైతులను గుర్తించేందుకు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది కౌలు రైతులకు కార్డులు అందజేశారు. మాజీ సర్పంచ్ మన్నె పోతురాజు, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు మిద్దే వెంకటేశ్వరరావు, నెర్సు శ్రీను వీఆర్‌వో భాస్కరరావు పాల్గొన్నారు.

### కౌలు రైతు కార్డులు పొందాలి

నిడమర్రు జూలై 16 : కౌలుకు సాగే చేసే రైతులందరూ కార్డులు తీసుకోవాలని ఎంఏవో ఎస్.గీతాదేవి అన్నారు. భువనపల్లి రైతు భరోసా కేంద్రంలో మంగళవారం రైతులకు కౌలు కార్డులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఐ సుబ్బారావు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్పీని కలిసిన పోలీస్ కో ఆపరేటివ్ సభ్యులు


జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన పోలీస్ కో ఆపరేటివ్ సభ్యులు

ఏలూరు క్రైం, జూలై 16 : జిల్లా ఎస్పీగా కొమ్మి ప్రతాప్‌శివ కిశోర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. మంగళవారం ఉదయం పోలీస్ కో ఆపరేటివ్ సభ్యులు ఇ.శ్రీనివాసరావు, బి.రామకృష్ణ, పి.నాగరాజు, కృష్ణంరాజు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## సత్యసాయి సేవలకు ఎల్లలు లేవు : కలెక్టర్


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు

ఏలూరు రూరల్, జూలై 16: సత్యసాయి సేవా సంస్థలో చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఎల్లలు లేవని, కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. కలెక్టర్‌ని సత్యసాయిసేవా సంస్థల అధ్యక్షుడు, ప్రతినిధులు కారుమిల్లి శేఖర్‌రావు, పైడేటి రామారావు, చోడిశెట్టి శాంతకుమార్, వై.వెంకటేశ్వరరావు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం ఎస్పీ కలిశారు.

## 20న ఏఐకేఎంఎస్ సమావేశం

బుట్టాయగూడెం, జులై 16 : రాజమహేంద్రవరంలో ఈ నెల 20న జరగనున్న ఏఐకేఎంఎస్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని నాయకులు కోరారు. మర్రిగూడెంలో మంగళవారం జనరల్ కౌన్సిల్ పోస్టర్లను విడుదల చేశారు. నాయకులు కె.సుందరావు, ఎస్.బాలసుందరం, బిఏసుపాదం, డి.కుమార్, దుర్గారావు, పూనెం పార్వతి, పి.భూలక్ష్మీ, గంగ, బులి వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

## హక్కుల కమిషన్ ఇన్‌చార్జిగా సత్యనారాయణ


ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న సత్యనారాయణ

భీమడోలు, జూలై 16 : జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ ద్వారకాతిరుమల ఇన్‌చార్జిగా భీమడోలుకు చెందిన పొలిశెట్టి వీర వెంకట సత్యనారాయణ ఎంపికయ్యారు. ఈ మేరకు భీమడోలులోని ఆయన కార్యాలయంలో ఎంసీఆర్సీ నేషనల్ చైర్మన్ ఎంవీఎల్ నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ద్వారకాతిరుమల సిటీ ఇంచార్జిగా సత్యనారాయణ ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరి రక్షణకు కృషి చేస్తానన్నారు.

## డీఎంవోగా ప్రసాద్

బుట్టాయగూడెం, జులై 16 : ఏలూరు జిల్లా కోటరామచంద్రపురం ఐటీడీఏ జిల్లా మలేరియా అధికారిగా పీఎస్ఎస్ ప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతేడాది మలేరియా కేసులు ఎక్కువగా వస్తున్న అల్లూరి సీతా రామరాజు మన్యం జిల్లాకు ప్రభుత్వం ఆయన్ని డిప్యూటేషన్‌పై పంపింది. ఇటీవలే ప్రభుత్వం ఆయన డిప్యూటేషన్‌ను రద్దు చేయడంతో తిరిగి కేఆర్ పురం ఐటీడీఏ జిల్లా మలేరియా అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు పీఆర్‌గూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి జె.సురేష్‌కుమార్ ఇంచార్జి డీఎంవోగా పని చేశారు.

## ఏఎంసీ చైర్మన్ పదవి కేటాయించాలి

చింతలపూడి, జూలై 16: చింతలపూడి మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పదవిని ఆశిస్తూ ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌కు కామవరపుకోట మాజీ ఎంపీటీసీ మరీదు వెంకట్రావు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట టీడీపీ బీసీ నాయకులు కంచర్ల శ్రీనివాసరావు, వేముల హనుమంతురావు, రేచర్ల, రావికంపాడు, సీతానగరం, తోచిలుక, ప్రగడవరం గౌడ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## మెటర్నిటీ అసిస్టెంట్ల జీతాల చెల్లించండి

చింతలపూడి, జూలై 16: మెటర్నిటీ అసిస్టెంట్ల జీతాల సమస్య పరిష్కరించాలని చింతలపూడి ఏరియా ఆస్పత్రిలో పని చేస్తున్న జీకే సుశీల, ఎన్.రత్నమాణిక్యం, ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌కు మంగళవానం వినతిపత్రం అందజేశారు. తమకు మార్చి 2024 నుంచి జూన్ వరకు జీతాలు రాలేదని వాపోయారు. 2024, జూన్‌లో తాము కమిషన్ కార్యాలయానికి వెళ్లి విజ్ఞాపన ఇచ్చి నెల రోజులు గడుస్తున్నా స్పందన లేదన్నారు. నాలుగు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నామని, తమ సమస్యకు దారి చూపాలంటూ రోషన్‌కుమార్‌కు వివరిస్తూ వినతి పత్రం అందజేశారు.

## రక్తదానం


రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎస్ఐ సుధాకర్, దివ్యాంగులు

భీమడోలు, జూలై 16 : రక్తదానం చేయడం స్ఫూర్తిదాయకమని ఎస్ఐ సుధాకర్ అన్నారు. గ్రామ దేవతల ఆలయం వద్ద మంగళవారం వికలాంగుల హక్కుల సమితి పోరాటం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా ఎస్ఐ సుధాకర్, జనసేన మండల అధ్యక్షుడు ప్రత్తిమదన్ హాజరయ్యారు. పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మామిడిపల్లి నాగభూషణం, బీజేపీ నాయకురాలు కృష్ణకుమారి, ఎమ్మార్పీఎస్, వికలాంగుల సమితి నాయకులు పాల్గొన్నారు.

## బాలికలు, మహిళలపై అఘాయిత్యాలను అరికట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఏలూరు టూ టౌన్, జూలై 16: బాలికలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను నిర్మూలించాలంటే ప్రజలను విద్యావంతులు చేయడమే మార్గమని బహుజన్ ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు అన్నారు. అన్నే భవన్‌లో మంగళవారం ఫెడరేషన్ 175వ వార్షికోత్సవం నిర్వహించారు. చదువు మధ్యలో ఆపేసిన బాలికలు చదువుకోవడానికి ఆర్థిక సాయం అందజేస్తానని ఎస్టీ ఎంపాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. వివరాలకు 77805 73531కు ఫోన్ చేయాలన్నారు. మానవత స్వచ్ఛంద సంస్థ నాయకులు ఆలపాటి నాగేశ్వరరావు, విశ్రాతం తహసీల్దార్ నాగేశ్వరరావు, దళిత నాయకులు నేతర అజయ్‌బాబు, శిరీష, రమేష్‌నాయక్, అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

## డ్వాక్రా రుణాల గోల్‌మాల్ పై ఆందోళన


ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం మహిళలు

ఏలూరు రూరల్, జూలై 16: లింగపాలెం మండలం చంద్రన్నపాలెం గ్రామంలో 13 గ్రామ సంఘాల నిధులు సుమారు రూ.28 లక్షలను మండల ఏపీఎం, గ్రామ బీఓఏ, ఎస్‌బీఐ బ్యాంకు మేనేజరు స్వాహా చేశారని, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ఆరోపించారు. డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద మంగళవారం మహిళలతో ధర్నా నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ మూడు నెలల క్రితమే మండలంలో జరిగిన గొడవ జిల్లా అధికారుల దృష్టికి రాలేదని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. డబ్బులు మొత్తం స్వాహా చేసిన అధికారుల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ విజయ్‌రాజుతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇవ్వడంతో ధర్నా విరమించామని రామకృష్ణ తెలిపా రు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆక్రమణలు తొలగించండి

ఏలూరు టూ టౌన్, జూలై 16: మెయిన్ బజారు, చేపల మార్కెట్‌లో ఆక్రమణలు తొలగించాలని నగర పాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. చేపల మార్కెట్‌ను మంగళవారం పెదబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. డ్రైనేజీని ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిని తొలగించాలని ఆదేశించారు. పాదచారులు నడవటానికి వీలు లేకుండా షాపులు పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏసీపీ తిరుపతిరావు, సీపీఎస్‌లు సాంబశివరావు, నాగమల్లేశ్వరరావు, రాజగోపాల్ పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికం

### చీరల వేలం.. రూ. 36 వేల ఆదాయం

ఏలూరు కార్పొరేషన్, జూలై 16 : దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోని పత్తేబాదలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన 150 చీరలు, ఏడు జాకెట్ ముక్కలకు మంగళవారం బహిరంగ వేలం వేశారు. ఈ వేలంలో రూ. 36 వేల 650 ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి డి.శంకరరావు తెలిపారు. ఈవో ఎం.రాధ, సిబ్బంది బాబి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

**తొలి ఏకాదశికి ఆలయాలు ముస్తాబు**

దక్షిణాయణం అనంతరం వచ్చిన ఏకాదశిని తొలి ఏకాదశి అంటారు. బుధవారం తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా నగరంలోని ఆలయాలను ముస్తాబు చేశారు. రామచంద్రరావుపేటలోని వేంకటేశ్వరస్వామి, పవరుపేటలోని వాసు దేవాలయం, అగ్రహారంలోని జనార్దనస్వామి ఆలయం, అశోక్‌నగర్‌లోని శ్రీవారి ఆలయాల వద్ద భక్తులు తొలి ఏకాదశి పూజలు నిర్వహించేందుకుగాను ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రత్యేక ప్రవేశ మార్గాలను కూడా ఏర్పాటు చేశారు.

**అంబికా ఆలయంలో సామూహిక వ్రతాలు**

సత్రంపాడులోని అంబికాదేవి ఆలయంలో ఆషాడ శుద్ధ ఏకాదశి, తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులతో సామూహికంగా శ్రీరమా సమేత వీర వేంకట సత్యనారాయణ స్వామి వ్రతాలను జరిపిస్తున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు బ్రహ్మశ్రీ వారణాసి రాఘవేంద్ర శర్మ తెలిపారు.

### ఆషాఢం సారె సమర్పణ

ఉంగుటూరు, జూలై 16 : కైకరంలో కళింగ సుందర సీతారామాలయంలో సీతమ్మకు, శివాలయంలో బాల సచ్చిదానంద పరమేశ్వరి అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు. గ్రామ మహిళలు శ్రీగీతామృత వాహిని, సీతారామ సత్సంగ్ అధ్యక్షులు కొచ్చర్లకోట శ్రీనివాసరావు, వియ్యన్న శర్మ తదితరులు పాల్గొన్నారు

### లలితా పీఠంలో అర్చనలు

కామవరపుకోట, జూలై 16 : దక్షిణాయణం ప్రారంభమైన అనంతరం వచ్చిన మంగళవారం కావడంతో స్థానిక లక్ష్మీ హయగ్రీవ లలితాశ్రీ పీఠంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకులు సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు, సత్యశ్రీనివాసాచార్యులు భక్తులతో పూజలు చేయించారు.

### మద్ది ఆంజనేయునికి ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం, జూలై 16 : గురవాయిగూడెంలోని శ్రీమద్ది ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెయ్యి మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశామని ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. వివిధ రూపాలలో రూ.84 వేల 340లు ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు.


పత్తేబాదలో చీరలను వేలం వేస్తున్న అధికారులు



ప్రధాని నెహ్రూ విశ్రమించిన నూజివీడు జడ్పీ అతిథి గృహం



నూజివీడు పంచాయతీరాజ్ అతిథిగృహం

డివిజన్ కేంద్రమైన నూజివీడుకు ముఖ్యమైన అతిథులు వచ్చినప్పుడు వారికి వసతి సౌకర్యాలు కల్పించేందుకు వివిధ శాఖల పరిధిలో నిర్మించిన అతిథి గృహాల పరిస్థితి గత మెంతో ఘనం నేడు దయనీయం అనే స్థితిలో ఉన్నాయి. ఒకప్పుడు దేశ ప్రథమ ప్రధాని నెహ్రూకు ఆతిథ్యం ఇచ్చిన జిల్లా పరిషత్ అతిథి గృహం నేడు పిచ్చి మొక్కలకు నిలయమైంది. అలాగే మరికొన్ని వసతిగృహాలు ఆలనా పాలనా లేక శిథిలస్థితికి చేరుతున్నాయి.

# అతిథులు చూడని గృహాలు

- గతమెంతో ఘనం.. నేడు దయనీయం
- ఆలనా పాలనా లేక శిథిల స్థితిలో అతిథి గృహాలు

(నూజివీడు టౌన్)

నూజివీడులో జడ్పీ గెస్ట్ హౌసే కాక నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు సంబంధించి అతిథి గృహం, పంచాయతీ రాజ్, ఆర్అండ్బీ అతిథి గృహాలు ఉన్నాయి. వీటిలో ఒక్క ఆర్అండ్బీ అతిథి గృహం తప్ప మిగిలిన వాటి వైపు అతిథులు కన్నెత్తిచూడని పరిస్థితి నెలకొంది.

## జడ్పీ అతిథిగృహం... గతమెంతో ఘనం

నూజివీడు మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న జడ్పీ అతిథి గృహం గత మెంతో ఘనం అనేందుకు చక్కటి ఉదాహరణ. ఈ అతిథి గృహం భారత తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూకు ఆతిథ్యం ఇచ్చింది. అనంతర కాలంలో అధికారుల నిర్లక్ష్య వైఖరితో శిథిలావస్థకు చేరుతోంది. అతిథిగృహం ప్రాంగణం మొత్తం పిచ్చిమొక్కలకు నిలయంగా ఉండగా, ఎంఅండ్కె రహదారివైపు ప్రహరీని ఆనుకుని రహదారి స్థలం సైతం ఆక్రమణలకు గురై అసలు ఈ వైపు అతిథులే చూడలేని పరిస్థితి నెలకొంది.

## ఐదేళ్లుగా పాడుపడిన ఎన్ఎస్పీ గెస్ట్ హౌస్...

నూజివీడు ఎన్ఎస్పీ అతిథి గృహం సైతం శిథిలావస్థకు చేరుతోంది. నాగార్జున సాగర్ ఎడమకాలువ నిర్మాణ సమయంలో నూజివీడు ఎన్ఎస్పీ క్వార్టర్స్తో పాటు అతిథి గృహాన్ని సైతం నిర్మించారు. ఇక్కడ సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో పాటు వివిధ రాజకీయ పార్టీల చెందిన వారికి ఆతిథ్యం ఇచ్చింది. గత టీడీపీ హయాంలో ఈ అతిథిగృహానికి మరమ్మతులు చేయించి వాడుకలోకి తీసుకురాగా, ఐదేళ్లుగా వైసీపీ ఈ అతిథి గృహాన్ని పట్టించుకోక పోవడంతో తిరిగి శిథిలావస్థకు చేరుతోంది.

## కార్యాలయంగా పంచాయతీరాజ్ అతిథిగృహం..

నూజివీడు పంచాయతీరాజ్ అతిథిగృహం, ప్రస్తుతం పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ కార్యాలయంగా మారింది. 1980లో నిర్మాణం పూర్తిచేసుకున్న ఈ అతిథిగృహం సైతం అతిథులకు అంతగా సేవలందించ లేకపోయింది. అయితే ఇది ఉపయోగంలో ఉండటం ముదావహం.

## ఇదొక్కటే మెరుగు..

రహదారులు, భవనాల శాఖ అతిథిగృహం అతిథులకు అందుబాటులో ఉందని చెప్పవచ్చు. వివిధ రాజకీయ పక్షాల నాయకులు అధికారులతో సమావేశాలు నిర్వహించిన సందర్భాలు, వివిధ హోదాల్లోని నాయకులు ఇక్కడ ఆతిథ్యం పొందుతున్నారు. నూజివీడులో ఉన్న అతిథి గృహాల్లో ఆర్అండ్బీ అతిథి గృహం తప్ప మిగిలిన అతిథిగృహాలన్నీ అతిథులు చూడని గృహాలుగానే మిగిలిపోయాయి.



ఎన్ఎస్పీ అతిథిగృహం



ఆర్అండ్బీ అతిథి గృహం



ఊరేగింపుగా తీసుకు వస్తున్న సారె..(కింద) సమర్పించిన సారె

## ఆషాఢ సారె సమర్పణ



కైకలూరు జూలై 16 : కైకలూరు చిన్నచెరువుగట్టుపై ఉన్న శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శ్రీవల్లీ దేవసేన అమ్మవార్లకు, ఆలయంలో కొలువైయున్న సీతమ్మవారికి సారెను అందజేశారు. మంగళవారం మహిళలు సారెను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది.

## ఇండియన్ ఎయిర్ఫోర్స్లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు రూరల్, జూలై 16: ఇండియన్ ఎయిర్ఫోర్స్ రిక్రూట్మెంట్ కోసం ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 24వ తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్లో జరిగిన సమావేశంలో ఎయిర్ఫోర్స్ అధికారి ఎన్.సందీప్, ఇండియన్ ఎయిర్స్ఫోర్స్లో అగ్ని వీర్ వాయు రిక్రూట్మెంట్పై అధికారులు వివరాలు తెలిపి సంబంధిత మెటీరియల్ను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ 18 నుంచి ఆన్లైన్లో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకునే విధంగా అన్ని కళాశాలల్లో పదిహేడు నుంచి ఇరవై ఒక్క ఏళ్ల వయస్సు ఉన్న విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. రిక్రూట్మెంట్ వైమానిక దళంలోకి ప్రవేశించేందుకు స్థిరమైన వృత్తిని దేశానికి సేవచేసే అవకాశాన్ని అందిస్తుందన్నారు. వెబ్సైట్ https://agnipathvayu.cdac.inలో రిజిస్ట్రేషన్ చేసుకోవ చ్చని ఆమె సూచించారు.



కలెక్టర్కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు

## సత్యసాయి సేవలకు ఎల్లలు లేవు : కలెక్టర్

ఏలూరు రూరల్, జూలై 16: సత్యసాయి సేవా సంస్థలో చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఎల్లలు లేవని, కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. కలెక్టర్ని సత్యసాయిసేవా సంస్థల అధ్యక్షుడు, ప్రతినిధులు కారుమిల్లి శేఖర్రావు, పైడేటి రామారావు, చోడిశెట్టి శాంతకుమార్, వై.వెంకటేశ్వరరావు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం ఎస్పీ కలిశారు.



మంత్రి పార్థసారథిని కలసిన టీడీపీ నాయకులు

## ముసునూరు మండల సమస్యలు పరిష్కరించాలి

ముసునూరు, జూలై 16: మండలంలోని దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని టీడీపీ ముసునూరు మండల నాయకులు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథిని కోరారు. మంగళవారం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కందుల పిచ్చియ్య, రమణక్కపేట, కాట్రేనిపాడు, చింతలవల్లి, వలసపల్లి గ్రామాల నాయకులు ఆముదాల ఇసాక్, పిన్నిబోయిన మంగేశ్వరరావు, ఏ.రాజు, నెరుసు శ్రీనివాసరావు విజయవాడలో మంత్రి పార్థసారథిని కలసి సమస్యలను వివరించారు. గత ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేయడంతో డ్రెయినేజీల సమస్య తీవ్రంగా ఉందని, అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయని, మౌలిక సదుపాయాల కల్పనకు కూడా నిధులు లేని పరిస్థితుల్లో సర్పంచ్లు అల్లాడుతున్నారని మంత్రికి వివరించారు. సమస్యలను పరిష్కరించాలని జిల్లా పంచాయతీరాజ్ అధికారులతో మంత్రి ఫోన్లో మాట్లాడారని, త్వరలోనే అధికార యంత్రాంగం సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటా రని మంత్రి చెప్పారని నాయకులు తెలిపారు.

## వేగవంతంగా పంట కాలువ అభివృద్ధి పనులు



కైకలూరు, జూలై 16: కైకలూరు పంటకాలువ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. మంగళ వారం కైకలూరు కాలువలోని సిల్ట్ను ఎక్స్కవేటర్లతో గట్లపైకి వేసి దానిని అక్కడి నుంచి ట్రాక్టర్ల ద్వారా దూర ప్రాంతాలకు తరలిస్తు న్నారు. అభివృద్ధి కమిటీ సభ్యుల పర్యవేక్షణలో పనులను నిర్వహిస్తున్నారు. కాలువలకు నీటిని విడుదల చేసిన సందర్భంగా మురుగునీరు దిగువకు పారేలా ఎక్కడికక్కడే వంతెనల వద్ద కూలీలతో చెత్తను గట్లపైకి వేస్తున్నారు. ఈ పనులను కమిటీ సభ్యులు కొండ్రెడ్డి సత్యనారాయణ, గుర్రం శ్యాంకుమార్, కేవీఈఎస్ ఎం నాయుడు, బెల్లాని శ్యామలరావు తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

## భూసార పరీక్షలతో అధిక దిగుబడులు



భూసార పరీక్షల కార్డులను అందిస్తున్న అధికారులు

కైకలూరు జూలై 16: భూసార పరీక్షలతో వరి పంటలో అవసరం మేరకే ఎరువులను ఉపయోగించి అధిక దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్త డాక్టర్ ఫణికుమార్ అన్నారు. మంగళ వారం కైకలూరు మండలం వేమవరప్పాడులో భూసార పరీక్షలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వరి వంగడాలు, సమగ్ర ఎరువుల యాజమాన్యం పట్ల రైతులు అవగాహన కల్గియుండాలని, పంట వేసిన 10, 20 రోజుల వయస్సులో కలుపు నివారణ చర్యలు చేపట్టాలని, అలాగే కౌలు గుర్తింపు కార్డు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ ఏడీఏ ఆర్. గంగాధరరావు, మండల వ్యవసాయాధికారి ఆర్. దివ్య, సర్పంచ్ నున్న రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి అచ్చెన్నాయుడిని కలసిన పీఏసీఎస్ ఉద్యోగ సంఘ నాయకులు

## పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ముదినేపల్లి, జూలై 16 : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఉద్యోగులకు ఉద్యోగ భద్రతతోపాటు పలు ప్రయోజనాలను కల్పిస్తూ గతంలో టీడీపీ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబరు 36 అమలుపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సహకార, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును ఏపీ పీఏసీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు కోరారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రిని సంఘ ప్రధాన కార్యదర్శి బొల్లినేని రఘురామ్, ఉమ్మడి కృష్ణా జిల్లాతోపాటు పలువురు సంఘ నాయకులు కలసి ఉద్యోగుల సమస్యలపై వివరించి మెమొరాండం అందజేశారు. రాష్ట్రంలోని 2051 పీఏసీఎస్లలో 7 వేల మందికిపైగా ఉద్యోగులు పని చేస్తున్నారని, 2016లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం సంఘాల ఉద్యోగులకు ప్రయోజనం కల్పించేలా జీవో 36ను జారీ చేసిందని ఆ జీవో వైసీపీ ప్రభుత్వం అమలు చేయలేదని తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి జీవో అమలుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు.

## డెక్క తొలగింపునకు నడుం బిగించిన రైతులు



పూడికతీత పనులను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి పిన్నమనేని

మండవల్లి జూలై 16 : మోటూరు ఎల్ఎస్ డ్రెయిన్లో భారీగా కిక్కిస, గుర్రపు డెక్క పెరిగిపోయి నీటిపారుదలకు అవరోధంగా మారిన నేపథ్యం లో వాటిని తొలగించేందుకు రైతులు శ్రీకారం చుట్టారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు చెత్త తొలగిం పునకు ఏర్పాటు చేసిన ఎక్స్కవేటర్కు కొబ్బరికాయ కొట్టి మంగళవారం పనులను ప్రారంభించారు. కృష్ణాజిల్లా నందివాడ మండలం, ఏలూరు జిల్లా మండవల్లి మండలంలోని గ్రామాల్లో చిన్నపాటి వర్షానికి డ్రెయిన్ నిండి నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. 15 ఏళ్లల్లో కనీసం తూడు తొలగించిన దాఖలాలు లేవు. దీంతో డ్రైన్లో మురుగునీరు కిందికి వెళ్లకపోవడంతో రైతులు, ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగళ్ళ రాము ఆదేశాలతో డ్రెయిన్లో డెక్క తొలగించేందుకు రైతులు ముందుకు వచ్చారు. నిధులు మంజూరు కాకపోయినా ముందస్తుగా రైతులు పెట్టుబడి పెట్టి పనులు చేయడం ఎంతో ఆదర్శమని మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు తెలిపారు. రైతులు గన్నమనేని నాని, కిరణ్రాజు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## డ్రెయినేజీ నిర్మాణం వేగవంతం చేయండి: డీఈఈ



మండవల్లి జూలై 16 : మండవల్లిలో 165 జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని విజయవాడ నేషనల్ హైవే ఆర్అండ్బీ డీఈఈ సత్యనారాయణ ఆదేశించారు. మంగళవారం మండవల్లిలో పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కైకలూరు నియోజకవర్గ కూటమి నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, ముళ్లపూడి సత్తిబాబు, కైకలూరు ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజుతో కలిసి పనులు నిర్వహణలో జరుగుతున్న జాప్యంపై డీఈఈకి వివరించారు. డ్రెయినేజీ నిర్మాణ పనులకు స్థల సేకరణలో కొంతమందికి ప్రభుత్వం నుంచి సొమ్ము అందక పోవడంతో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని వాటిని పరిష్కరిస్తామని డీఈఈ వివరించారు.

## తాగునీటి చెరువులను నింపుకోవాలి

కలిదిండి, జులై 16 : తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపుకోవాలని ఎంపీడీవో దినతేజ్ సర్పంచ్లు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం కలిదిండిలో మోటార్లతో నింపుతున్న తాగునీటి చెరువును పరిశీలించి మాట్లాడుతూ సీబీ కెనాల్ వెంబడి ఉన్న గ్రామాల్లో అడుగంటిన తాగునీటి చెరువులు నింపే వరకు నీటి వంతు వస్తుందన్నారు. శివారు గ్రామాలకు తాగునీటి వంతు రెండు రోజుల్లో ఇస్తామన్నారు. కాల్వల్లో కలుషిత నీరు ఉప్పుటేరులోకి వదిలిన తర్వాతే లంక గ్రామాల్లో తాగునీటి చెరువులను నింపుకోవాలన్నారు. తాగునీటి వంతును ఆక్వా చెరువులకు మళ్లిస్తే చర్యలు తప్పవన్నారు. సర్పంచ్ మారుతి ప్రసన్న, కార్యదర్శి ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

## పెదలంక ప్రధాన కాల్వలో కలుషిత నీరు

కలిదిండి, జులై 16 : పెదలంక ప్రధాన కాల్వ కలుషిత ఉప్పునీటితో ఉంది. ఉప్పుటేరులో ఉప్పునీరు కాల్వలోకి చొచ్చుకుని రావటంతో సుమారు 10 కిలోమీటర్ల మేర కాల్వలో ఉప్పునీరు ఉంది. దీంతో కాల్వ ఉప్పుమయంగా మారింది. అడుగంటిన తాగునీటి చెరువులను నింపటానికి త్వరలో తాగునీటి వంతు విడుదల చేయనున్నారు. కాల్వలో ఉప్పునీరు ఉంటే తాగునీరు శివారు గ్రామాలకు ఏ విధంగా సరఫరా అవుతుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సంతోషపురం, భాస్కరరావుపేట, పొలు పేట, మూల్లంక, రామకృష్ణపురం, అప్పారావుపేట, పెదలంక గ్రామాల తాగునీటి చెరువులను నింపటానికి ఈ కాల్వ ద్వారానే తాగునీరు సరఫరా అవుతుంది. ఉప్పుటేరులో ఉప్పునీరు కాల్వలోకి చొచ్చుకు వచ్చి ఉప్పు కయ్యగా మారుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పెదలంక కాల్వలోకి ఉప్పుటేరు ఉప్పునీరు చొచ్చుకు రాకుండా అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

## నూజివీడు ప్రభుత్వాస్పత్రికి కేంద్ర బృందం



నూజివీడు, జూలై 16: నూజివీడు ఏరియా ఆసుపత్రిని మంగళవారం నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో 17 మంది కేంద్ర బృంద సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా పశ్చిమ బెంగాల్ వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి నారాయణ స్వరూప్ నిగమ్, నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ సరోజ్కుమార్, మధ్యప్రదేశ్కు చెందిన నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ ప్రియాంక దాస్ ఏరియా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ పనితీరు, ఎన్సీడీ ప్రోగ్రామ్, కార్డియాక్ వైద్యంలో స్టెమ్ ఇంజక్షన్లు ఇస్తున్న విధానాలను పరిశీలించారు. రోగులను వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య సేవలపై వైద్యులను అభినందించారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ నరేంద్రసింగ్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యాన పంటల సబ్సిడీపై రైతులకు తెలపాలి

ముసునూరు, జూలై 16: ఉద్యాన పంటలకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ, ఇతర ప్రోత్సాహకాలపై రైతులకు అవగాహన కల్పించాలని మండల ఇన్చార్జ్ ఉద్యానవన శాఖాధికారిణి కె. ప్రియాంక జ్యోతి అన్నారు. మంగళవారం ముసునూరు రైతు సేవా కేంద్రంలో వీహెచ్ఏలకు ఆమె ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్వో మాట్లాడుతూ నూతనంగా మామిడి, నిమ్మ, కోకో, కొబ్బరి, ఆయిల్ పామ్, కూరగాయలు తదితర పండ్ల తోటల రైతులకు సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే రైతులు పూర్తి వివరాలకు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఉన్న వీహెచ్ఏలను సంప్రదించాలని కోరారు.

## ఎరువుల వినియోగంపై అవగాహన

కలిదిండి, జూలై 16 : వెదజల్లిన పొలాల్లో కలుపు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏరువాక కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఫణికుమార్ అన్నారు. మంగళవారం కోరుకొల్లులో భూసార కార్డు ఆధారంగా సమతుల ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం పంట పొలాలను సందర్శించి రైతులకు తగు సూచనలిచ్చారు. వ్యవసా య శాఖ ఏడీఏ గంగాధరరావు, మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్ పాల్గొన్నారు.



## వాటర్ ట్యాంకర్ వితరణ

కలిదిండి, జులై 16 : పెదలంకలో ముద్దం నాగేశ్వరరావు స్మృత్యర్థం ఆయన కుమారుడు, టీడీపీ సీనియర్ నాయకుడు, డీసీ మాజీ చైర్మన్ ముద్దం భోగేశ్వరరావు నూతనంగా ఏర్పాటు చేసిన ఉచిత వాటర్ ట్యాంకర్ను టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ప్రజల దాహార్తిని తీర్చటానికి ఉచితంగా తాగునీటి ట్యాంకర్ను ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. సర్పంచ్ మోకా లక్ష్మీ రామకృష్ణ, మాజీ సర్పంచ్ మంతెన సుబ్బరాజు, నాయకులు దున్న భోగేశ్వరరావు, అంగ్రాజు శ్రీనివాస్, అక్కల బోసు, పేటేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

## నరసింహారావుపాలెంలో వైద్య శిబిరం



చాట్రాయి, జూలై 16: మండలంలోని నరసింహారావుపాలెంలో పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. 80 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. వర్షాకాలంలో సీజనల్ జ్వరాలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీరు తాగాలని, దోమతెరలు వాడాలని, ఆహారం వేడి వేడిగా భుజించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామ ప్రముఖులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## గుడ్ టచ్.. బ్యాడ్ టచ్పై అవగాహన



ఆగిరిపల్లి, జూలై 16: ఆడపిల్లల రక్షణ, సంరక్షణ కోసం, వారికి అవసరమైన సమాచారాన్ని అందించటానికి మంగళవారం ఆగిరిపల్లి కొండ కాలనీ ప్రాథమిక పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో షేక్ నూరాని ఆడపిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్పై, చట్టాలపై అవగాహన కల్పించారు. ఏసీడీపీవో డీవీవీ నాగేశ్వరి ఉమెన్ హెల్ప్లైన్ 181 గురించి, చైల్డ్ హెల్ప్లైన్ 1098పై వివరించారు. సూపర్వైజర్లు రాగమయి సులోచన రాణి, మండలంలోని అన్ని గ్రామాల అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు

చాట్రాయి, జూలై 16: మండలంలోని సోమవరం, నరసింహారావుపాలెంలలో పంచాయతీల ఆధ్వర్యంలో మంగళవారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లించి, మంచినీటి ట్యాంకులు శుభ్రం చేయించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, జ్వర లక్షణాలు కన్పిస్తే పీహెచ్సీకి వెళ్ళి చికిత్స పొందాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వైస్ ఎంపీపీ సుబ్బారెడ్డి, సర్పంచ్లు శోభన బాబు, ప్రశాంతి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాలికపై అత్యాచారం

- యువకుడితో పాటు మరో ముగ్గురిపై పోక్సో కేసు

టి.నరసాపురం, జూలై 16: ఇంటర్ చదువుతున్న బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకుడితో పాటు అతడికి సహకరించిన మరో ముగ్గురిపై పోక్సో కేసు నమోదు చేసిన ఘటన టి. నరసాపురం మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలిక జంగారెడ్డిగూడెం ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ పూర్తి చేసి ఇంటివద్దే ఉంది. అదే గ్రామానికి చెందిన యువకుడు తాడి నాగకుమార్ స్థానికంగా హైస్కూల్లో చదివే సమయంలో ప్రేమపేరుతో బాలిక వెంటపడి ప్రేమించినట్టు సమాచారం. ఈ క్రమంలో 2023 ఆగస్టులో జంగారెడ్డిగూడెం హాస్టల్లో ఉంటూ చదువుతున్న బాలిక సెలవులకు ఇంటికి వచ్చి తిరిగి వెళ్ళగా హాస్టల్ తెరవకపోవడంతో విషయం తెలుసుకున్న యువకుడు జంగారెడ్డిగూడెం వెళ్లి బాలికను గ్రామానికి తీసుకువచ్చి రాత్రి స్థానిక సచివాలయంలో ఉంచి శారీరకంగా అనుభవించాడు. అనంతరం ఈనెల 6వ తేదీ రాత్రి యువకుడు బాలికకు ఫోన్చేసి మాట్లాడాలని చెప్పి మరో యువకుని సాయంతో ఆ బాలికను సచివాలయం వద్దకు తీసుకువచ్చారు. అక్కడ ఉన్న మరో ఇద్దరు యువకుల సాయంతో ఏలూరు రైల్వేస్టేషన్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి నిందితుడు బాలికను రైల్లో వైజాగ్ తీసుకెళ్లి ఓ హోటల్లో పలుమార్లు శారీరకంగా అనుభవించాడని తెలిసింది. అనంతరం ఇంటికి తీసుకువచ్చి దింపి వెళ్లిపోయాడని బాలిక ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## స్నేహితులతో ఆడుకోవడానికి వెళ్లి..

- విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి



ప్రసాద్ మృతదేహం

పోలవరం జూలై 16 : సరదాగా స్నేహితులతో ఆడుకోవడానికి వెళ్లి విద్యుదాఘాతంతో ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన పోలవరంలో మంగళవారం ఉదయం జరిగింది. పోలవరం ఎస్ఐ పవన్ కుమార్ తెలిపిన వివరాలివి.. పాత పోలవరానికి చెందిన కోవేటి ప్రసాద్(11) పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. కడమ్మ స్లూయి జ్ వద్దకు తన స్నేహితులతో వెళ్లి స్లూయిజ్ వద్ద బహిర్భూమికి వెళుతూ తెగిపడి ఉన్న విద్యుత్ వైరుని పట్టుకోవడంతో షాక్కి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విద్యార్థి తండ్రి పోసియ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ ఏఈ కొండా సత్యనారాయణను వివరణ కోరగా విషయం తెలిసిన వెంటనే తమ సిబ్బంది ఘటనా ప్రాంతానికి వెళ్లి సరఫరా నిలిపివేశారన్నారు. న్యూట్రల్ వైరు తెగిపడడం వల్ల ప్రమాదం సంభవించిందన్నారు. బాలుడి కుటుంబానికి విద్యుత్ శాఖ తరఫున నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## క్రైం సమాచారం

### పోక్సో కేసులో నిందితుడికి జైలు

ముదినేపల్లి, జులై 16: అయిదేళ్ల క్రితం బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి మచిలీపట్నం పోక్సో కోర్టు జడ్జి జి.వెంకటేశ్వర్లు మూడేళ్ల జైలు, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు ఇచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం 2018 అక్టోబరు 25న ముదినేపల్లి మండలంలోని ఒక గ్రామంలో బాలికకు మాయమాటలు చెప్పి అదే గ్రామానికి చెందిన సునీల్ కుమార్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీనిపై బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ వి.రాజేంద్ర ప్రసాద్ పోక్సో కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి పలువురు సాక్షులను విచారించిన అనంతరం మంగళవారం జడ్జి తీర్పునిచ్చినట్లు కైకలూరు రూరల్ సీఐ కృష్ణ కుమార్, ముదినేపల్లి ఎస్ఐ వెంకట్ కుమార్ తెలిపారు. పీపీ ఎం.వి.మహేష్ కుమార్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు. సీఐ, ఎస్ఐతోపాటు కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్చార్జ్, ముదినేపల్లి ఏఎస్ఐ దత్తును డీఎస్పీ శ్రీనివాసులు అభినందించారు.

### చెల్లని చెక్కులు ఇచ్చినందుకు జైలు, జరిమానా

నూజివీడు టౌన్, జూలై 16: చెల్లని చెక్కు కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష, రూ. 2 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. నూజివీడు పట్టణానికి చెందిన వ్యాపారి రాసాబత్తుల వెంకట్రావు 2016 జూలైలో విశాఖపట్నానికి చెందిన ఎడ్ల వెంకటేశ్వరరావుకు రూ.3 లక్షలు అప్పుగా ఇచ్చాడు. బాకీ తీర్చమని వెంకట్రావు అడగ్గా వెంకటేశ్వరరావు రూ. లక్షా 50 వేలకు మూడు చెక్కులు ఇవ్వగా అవి చెల్లుబాటు కాలేదు. ఈ నేపథ్యంలో వెంకట్రావు కోర్టులో కేసు దాఖలు చేయగా, నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి కేసును విచారించి నిందితుడు వెంకటేశ్వరరావుకు జైలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

### కారు బోల్తా.. ఇద్దరికి గాయాలు



నూజివీడు టౌన్, జూలై 16: నూజివీడు మండలం హనుమంతులగూడెం గ్రామం వద్ద కారు బోల్తాపడిన ఘటనలో ఇద్దరు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. నూజివీడు నుంచి విస్సన్నపేట వెళుతున్న కారు హనుమంతుల గూడెం మలుపు వద్ద ఒక్కసారిగా పల్టీ కొట్టింది. కారులో నలుగురు ప్రయాణిస్తుండగా ఇద్దరికి గాయాలు కాగా వారిని నూజివీడులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కారు ప్రమాదానికి గురైన సమయంలో రహదారిపై ఎటువంటి భారీ వాహనాలు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.